ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 11 అక్టోబరు 2025

బాధ్యతలు చేపట్టిన వీసీ



ఏఎఫ్ఏయూ వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న జయరామిరెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు యూనివర్సిటీ ప్రజా సంబంధాల అధికారి వి.శివకృష్ణారెడ్డి, విభాగాల కోఆర్డినేటర్లు, బోధన-బోధనేతర సిబ్బంది, విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో సృజనాత్మకత, వినూత్నత, విద్యా ప్రమాణాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషిచేస్తామన్నారు.

ముగిసిన శిక్షణ

- 13 నుంచి విధుల్లోకి కొత్త టీచర్లు



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. జిల్లాలో పోస్టుల కేటాయింపులు కూడా పూర్తయింది. 13వ తేదీ నుంచి కొత్త ఉపాధ్యాయులు పాఠశాలల్లో విధుల్లోకి చేరబోతున్నారు. ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహించిన శిక్షణలో బోధనా పద్ధతులు, విద్యార్థి మానసికాభివృద్ధి, తరగతి నిర్వహణ, ఎన్ఈపీ-2020 విధానాలపై ప్రత్యేక మాడ్యూల్స్ రూపొందించారు. ప్రతి అభ్యర్థి ప్రాక్టికల్ సెషన్లలో పాల్గొని డిజిటల్ లెర్నింగ్, మల్టీ గ్రేడ్ బోధన వంటి అంశాలపై ప్రాక్టికల్ అవగాహన పొందారు. శిక్షణ పూర్తయిన వీరందరికీ తుది నియామక ఉత్తర్వులు శని, ఆదివారం పంపిణీ కానున్నాయి. కొత్త టీచర్లు తమ తమ పాఠశాలల్లో 13వ తేదీ సోమవారం నుంచి విధుల్లో చేరనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఖాళీలతో నిస్సత్తువగా ఉన్న పాఠశాలలు ఇపుడు కొత్తవారి రాకతో బలం పుంజుకోనున్నాయి.

ఉచితబియ్యం ఉపయోగమేనా..

- ప్రజల నాడి తెలుసుకునేందుకు కేంద్ర బృందం విచారణ

కడప కలెక్టరేట్, జూలై 10(ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత బియ్యం పథకం అమలు తీరుపై కేంద్ర బృందం రెండు రోజులుగా జిల్లాలో పర్యటించి ప్రజల నాడిని తెలుసుకుంటున్నారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందిస్తున్న బియ్యం వినియోగంపై కార్డుదారుల అభిప్రాయాలను సేకరించేందుకు ఢిల్లీ నుంచి జాతీయ ఫుడ్ కార్పొరేషన్‌కు చెందిన జనరల్ మేనేజర్ జేఎస్ సిజు, కర్నూలు డివిజనల్ మేనేజర్ అవతార్ సింగ్, మధు బాబు, డీఎస్ఓ శిరీష, డీఎం నాగసుధ తదితరులు కడప, జమ్మలమడుగు, యర్రగుంట్ల, సీకేదిన్నె మండలాల్లో బుధ, గురువారాల్లో పర్యటించారు. పలు రేషన్ దుకాణాలను సందర్శించారు. గోడౌన్లను, మార్కెట్ యార్డులను, ఆర్బీకేలను సందర్శించి కార్డుదారులు, రైతులకు సంబంధించిన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో మోదీ సర్కారు పేదలకు ఉచిత బియ్యం, రైతులకు అందిస్తున్న పథకాలు ప్రజలకు ఎంత మాత్రం తెలుసు అనే అంశంపై అడిగి తెలుసుకున్నారు. 27 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని కార్డుదారులకు వినిపించి వారి అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దారు మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

నగరంలో వర్షం

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 10: కడప నగరంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. ఎండ వేడిమితో ఇబ్బందిపడ్డ ప్రజలకు వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో సేదతీరారు. చలిగాలులు వీచాయి. పలు కాలనీలు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచింది. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండ్, అప్సర సర్కిల్, హోమియోపతి కాలేజీరోడ్‌లో వర్షం నీరు నిలిచి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రోడ్లపై మోకాలు లోతు నీరు నిలిచింది. హోమియోపతి కళాశాల రోడ్డులో రాకపోకలు కూడా స్తంభించాయి.



కడప హెడ్ పోస్టాఫీసు ఎదురుగా రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

తూచ్?!





- మళ్లీ మొదటికొచ్చిన టీడీపీ నగర కమిటీ ఎంపిక
- ఇటీవలే నగర కమిటీని ప్రకటించిన జిల్లా అధ్యక్షుడు
- దీనిని వ్యతిరేకిస్తున్న టీడీపీలోని ఓ వర్గం
- మళ్లీ ఐవీఆర్ఎస్ కాల్ సర్వేతో అభిప్రాయాల సేకరణ
- దీనిపై కడప టీడీపీలో పెద్ద చర్చ

మేడిపండు చూడు మేలిమైయుండు పొట్టవిప్పి చూడ పురుగులుండు.. అన్న చందంగా కడప టీడీపీ పరిస్థితి తయారైంది. 1999 ఎన్నికల తరువాత సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 2024లో జరిగిన ఎన్నికల్లో కడప ఎమ్మెల్యేగా ఆర్.మాధవి గెలిచారు. ఈ గెలుపు కడప టీడీపీకి బూస్ట్‌గా మారుతుందనుకుంటే కొద్దిరోజులకే పార్టీలో విభేదాలు వచ్చాయి. ఇప్పుడు జిల్లాలో ఎక్కడా లేనివిధంగా కడప అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రచ్చరచ్చగా మారింది. సోషల్ మీడియాలో టీడీపీ శ్రేణులు పరస్పర పోస్టులు పెట్టుకుంటూ పెద్ద చర్చకే దారి తీస్తున్నారు. ఈ నేపథ్యంలో కడప నగర కమిటీ ఎంపికపై మళ్లీ ఇప్పుడు అమరావతి నుంచి టీడీపీ శ్రేణులకు ఐవీఆర్ఎస్ కాల్ ద్వారా అభిప్రాయ సేకరణ కోరడం హాట్‌టాపిక్‌గా మారింది. ఇటీవల కడప నగర కమిటీని జిల్లా అధ్యక్షుడు ప్రకటించారు. ఇప్పుడు మళ్లీ బుధవారం నుంచి నగర కమిటీపై అభిప్రాయం కోరుతూ కాల్స్ రావడం విశేషం.

(కడప-ఆంధ్రజ్యోతి): కడప ఒకప్పుడు టీడీపీకి అడ్డాగా ఉండేది. 1994, 1999 ఎన్నికల్లో వరుసగా దివంగత ఖలీల్‌బాషా గెలుపొందారు. ఈయన మంత్రిగా కూడా పనిచేశారు. తర్వాత పాతికేళ్లు ఇక్కడ టీడీపీ గెలవలేదు. 2021 డిసెంబరు నుంచి కడప నగర కమిటీ అధ్యక్షుడిగా సానపురెడ్డి శివకొండారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్సీ సామాజికవర్గానికి చెందిన జయకుమార్ ఇతర కార్యవర్గం పనిచేస్తూ వచ్చింది. అప్పట్లో కడపలో జగన్ మేనియా ఎక్కువా ఉండేది. అయినప్పటికీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శివకొండారెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. కరోనా సమయంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు దేవాలయాల పరిరక్షణ, బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ, అసెంబ్లీలో చంద్రబాబు సతీమణిని అవమానించడంతో గౌరవసభ, బాబు షూరిటీ, ఓటరు వెరిఫికేషన్, చంద్రబాబును జైల్లో పెట్టినప్పుడు దీక్షలు తదితర కార్యక్రమాలన్నీ నగర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. ఇదే టీం గత ఏడాది జరిగిన ఎన్నికల్లో పాల్గొంది. ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపునకు కృషి చేసింది. అయితే కడపలో టీడీపీ గెలిచిన తరువాత కొన్నాళ్లకే ఇక్కడ పార్టీలో విభేదాలు బయటపడ్డాయి. రెండు గ్రూపులుగా విడిపోయాయి.

మరోసారి ఐవీఆర్ఎస్ కాల్ సర్వే

టీడీపీ సంప్రదాయంలో భాగంగా జాతీయ, రాష్ట్ర, జిల్లా, నగర, పట్టణ, మండల అధ్యక్షుల నియామకాన్ని చేపడుతుంది. ఇందులో భాగంగా కడప నగర పాలకవర్గాన్ని ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఎంపిక చేసి రాష్ట్ర పార్టీకి పంపించారు. ఈ సిఫారసుపై 20 రోజుల క్రితమే టీడీపీ రాష్ట్ర కమిటీ ఐవీఆర్ఎస్ కాల్ ద్వారా సర్వే నిర్వహించింది. కడప నగర కమిటీలో సభ్యులుగా ఉన్న సుమారు 600 మందికి ఈ జాబితా పంపించి అప్రూవ్, రిజక్ట్ ఆప్షన్స్ ఇచ్చింది. కడప కార్పొరేషన్‌లో మొత్తం 50 డివిజన్లు ఉన్నా మూడు డివిజన్లు కమలాపురం నియోజకర్గంలోని సీకేదిన్నె పరిధిలోకి వెళ్తాయి. 47 డివిజన్లు కడప పరిధికి వస్తాయి. ఒక్కో డివిజనులో అధ్యక్ష కార్యదర్శి ప్రధాన కార్యదర్శి కలుపుకుంటే దాదాపు పది మంది వరకు ఉంటారు.. అంటే మొత్తం 500 మంది. ఇక మాజీ కార్పొరేటర్లు, సీనియర్ టీడీపీ నేతలు కలుపుకుంటే కనీసం 400 మంది ఉంటారు. ఈ నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడు,

ఎమ్మెల్యే పంపిన నగర కమిటీ జాబితాను చాలామంది వ్యతిరేకించారని టీడీపీలోని ఓ వర్గం చెబుతుండేది. అయినప్పటికీ పదిరోజుల క్రితం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి నగర కమిటీని ప్రకటించారు. ఇది తీవ్ర దుమారం రేపింది. గత ఏడాది జరిగిన ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన వారికే కమిటీలో ప్రాధాన్యం ఇవ్వడంతో టీడీపీ శ్రేణులు షాక్ గురయ్యాయి. దీనిపై పైస్థాయిలో ఫిర్యాదు చేశారని చెబుతారు. ఇప్పటికే మట్టి తవ్వకాలపై రచ్చ జరిగి చివరికి విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో టీడీపీ కేడరు వ్యతిరేకించిన కమిటీనే నగర కమిటీగా నియమించడంపై ఓ వర్గం జీర్ణించుకోలేకపోయింది. వీరంతా రాష్ట్ర అధిష్ఠానానికి మరోసారి ఫిర్యాదు చేశారు. దీంతో మళ్లీ కడప నగర కమిటీపై అమరావతి నుంచి బుధ, గురువారాల్లో ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ కోరారు.

అధికారంలో ఉంటే.. వారికే ప్రాధాన్యం

పదిరోజుల క్రితమే టీడీపీ జిల్లా అధ్యక్షుడు అధికారికంగా కడప నగర కమిటీని ప్రకటించారు. మళ్లీ ఇప్పుడు నగర కమిటీకోసం అభిప్రాయ సేకరణ అడగడంతో రాజకీయవర్గాల్లో పెద్ద చర్చ నడుస్తోంది. కడప అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ ఇప్పటికే కలగూరగంపగా తయారైంది. వలస బ్యాచ్‌కే ప్రాధాన్యం ఉందన్న చర్చ సాగుతోంది. 2014-19లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా కడపలో ఇదే పరిస్థితి సాగింది. అప్పట్లో కూడా వైసీపీ అండ్ కో బ్యాచ్‌కే ప్రాధాన్యం ఇచ్చారని చెబుతారు. వీరంతా నీరు-చెట్టు, ఇతర కాంట్రాక్టు పనుల్లో బాగా లబ్ధి పొంది, 2019లో జరిగిన ఎన్నికలకు ముందు జగన్ మా వాడు అంటూ వైసీపీలోకి జంప్ అయ్యారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రమే కరుడుగట్టిన పసుపు సైనికులను ప్రోత్సహిస్తారు. అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోరనేదానికి 2014-19 నాటి పరిస్థితే ఇప్పుడూ ఉందని.. దీనికి కడప నగర కమిటీనే తాజా ఉదాహరణ అని టీడీపీలో చర్చించుకుంటున్నారు. మొత్తానికి కడప నగర కమిటీ పెద్ద చర్చగా మారింది.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ప్రయోజనం



ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగ్జిబిషన్ మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం వలన ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జార్జి కారోనేషన్ క్లబ్‌లో వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ద్వారా ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగ్జిబిషన్ కం సేల్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీఎస్టీ తగ్గింపు వలన రాష్ట్ర ప్రభుత్వానికి రూ.8 వేల కోట్లు ఆదాయం తగ్గినా ప్రజల ప్రయోజనమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సేల్‌ట్యాక్స్ జాయింట్ కమిషనర్ జి.సుమతి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వస్తువులపై 28 శాతం ఉన్న జీఎస్టీని 18 శాతానికి తగ్గించారన్నారు. వ్యాపారులతో చర్చించి పండుగ ఆఫర్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా వివిధ వ్యాపార సంస్థలు టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, వాషింగ్‌మిషన్లు, ఇన్వర్టర్ బ్యాటరీలు ఎగ్జిబిషన్‌లో విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జింకా రవిచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్లు జ్ఞానానందరెడ్డి, రాజనరసింహారెడ్డి, జీఎస్టీ నోడల్ ఆఫీసర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్

నాగదస్తగిరి రెడ్డిపై పీడీ యాక్టు



కడప క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్ ఇరగంరెడ్డి నాగ దస్తగిరిరెడ్డి పై పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. దువ్వూరు మండలం పుల్లారెడ్డిపేట గ్రామానికి చెంది న ఎర్రచందనం స్మగ్లర్ నాగదస్తగిరి రెడ్డి (36) ప్రొద్దుటూరులోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇతను 8 సంవత్సరాల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడు. 2014 నుంచి ఇప్పటివర కు ఇతనిపై 128 కేసులు ఉన్నాయి. అందులో 90 ఎర్రచందనం కేసులు 38 దొంగతనం కేసులు. గతంలో ఇతనిపై మూడుసార్లు పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపారు. అయినా ఇతను జైలు నుంచి బయటకు వచ్చి కూడా ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడు. ఏపీ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన కూలీలను తీసు కొచ్చి అట్లూరు, గువ్వలచెరువు, వీరబల్లె, సుండుపల్లె, ప్రాంతాల్లో అడవులకు పంపించి ఎర్రచందనం చెట్ల ను నరికి దుంగలను కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు అక్రమ రవాణాచేసి అంతర్జాతీయ స్మగ్లర్లకు విక్రయించి అక్రమంగా డబ్బులు సంపాదించాడు. ఈ మేరకు ఇతనిపై నివేదిక రెడీ చేసి కలెక్టర్‌కు పంపగా ఆయన పీడీ యాక్టు ప్రయోగించారని ఎస్పీ తెలిపారు. కాగా.. నాగదస్తగిరిరెడ్డి ఓ ఎర్రచంద నం కేసులో ప్రస్తుతం కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

మైనార్టీలకు ఖతర్‌లో ఉద్యోగావకాశాలు

- నెలకు రూ.1.20 లక్షల జీతం
- దరఖాస్తుకు రేపే ఆఖరు రోజు
- రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ ప్రకటన

కలికిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ వర్గాలకు చెందిన యువతకు ఖతర్ రాజధాని దోహాలో హోమ్‌కేర్ నర్సు ఉద్యోగాలకు నిరుద్యోగ యువతకు అవకాశాలున్నాయని కడప, అన్నమయ్య జిల్లాల ఏపీ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహ క సంచాలకుడు షేక్ హిదయతుల్లా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులు ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీకులు మతాలకు చెందిన పురుషులు, మహిళలు అర్హులుగా పేర్కొన్నారు. బీఎస్సీ (నర్సింగ్), జీఎన్ఎం (నర్సింగ్) అర్హతలు కలిగి, రెండేళ్ల అను భవంతో 21 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు ఉండాలని తెలిపారు. నెలకు జీతం భారత కరెన్సీ ప్రకారం రూ.1.20 లక్షలు ఉంటుందని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 13వ తేది సోమవారం విజయవాడలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను నైపుణ్యం.ఏపి.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా కానీ, ఏపీ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, హెడ్‌ఆఫీస్ 393-1, మూడవ అంతస్తు, ఆంజనేయ కాంప్లెక్స్, ఎం.జి.రోడ్డు, లబ్బీపేట, విజయవాడ- 520010 చిరునామాకు నేరుగా పంపుకోవాలని, వివరాలకు 9290448452, 9515835805ను సంప్రదించాలని సూచించారు. ఇదిలా ఉండ గా రెండు రోజుల ముందు సమాచారం తెలియజేయడం ఏమిటని, అవసరమైన సర్టిఫికెట్లు ఎలా సమకూర్చుకోవాలంటూ పలువురు అభ్యర్థులు వాపోతున్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఉర్సు

- 4 నుంచి 10వరకు నిర్వహణ
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



పెద్దదర్గా ఉర్సు నిర్వహణపై మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, చిత్రంలో దర్గా పీఠాధిపతి జనాబ్ ఆరిఫుల్లా హుసేనీ, ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు

కడప కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా ఖ్యాతిగాంచిన కడప అమీన్‌పీర్ దర్గా (పెద్ద దర్గా) ఉర్సు మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమీన్‌పీర్ దర్గాలోని ముషాయిరా హాలులో దర్గా ఉత్సవాల నిర్వహణ, ముందస్తు ప్రచారం ఏర్పాట్లపై సంబంధిత దర్గా పీఠాధిపతి జనాబ్ ఆరిఫుల్లా హుసేనీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్‌తో పాటు ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, నగర ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్‌బేగం, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన కడపలో మన పండుగగా భావించే పెద్దదర్గా ఉత్సవాలను అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని కోరారు. అన్ని రకాల ఉత్సవ ఏర్పాట్లను ఒక్కోశాఖ జిల్లా అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తామని అన్నారు. అనంతరం కడప ఎమ్మెల్యే మాట్లాడుతూ శతాబ్దాల చరిత్ర కలిగిన ప్రఖ్యాత అమీన్‌పీర్ దర్గా ఉత్సవాలను మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా ఘనంగా నిర్వహించాలని కోరారు. ఎస్పీ మాట్లాడుతూ దర్గా ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. నిర్దేశించిన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, అదనపు భద్రతా సిబ్బందిని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం అందరూ కలసి ఉర్సు ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేఎంసీ కమిషనర్ మనోజ్‌రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు, దర్గా కమిటీ సభ్యులు అమీర్‌బాబు, గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్, వైసీపీ నాయకులు సుభాన్‌బాషాతో పాటు ఉర్సు కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉర్సు కార్యక్రమ వివరాలిలా..

పెద్ద దర్గా ఉర్సు ఉత్సవాలలో భాగంగా మొదట ఈ నెల 23వ తేదీ రాత్రి 10గంటలకు నషాన్ మెరవణి నిర్వహిస్తారు. నవంబరు 4వ తేదీ ఉదయం 8గంటలకు సర్గిరోల్, షక్కీర్లతో ఊరేగింపు, 5న గంధం, 6వ తేదీ రాత్రి 9గంటలకు ఉర్సు, 7న తహలీల్ ఫతేహ ఉత్సవం, 8న ఖవ్వాలి, 9న జెండా ప్రతిష్ఠ నిర్వహిస్తారు.

అసాంఘికకాలలపై దాడులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- క్లబ్‌లో పేకాట బంద్
- టూటౌన్‌లో మట్కా బీటర్ల అరెస్టు



అరెస్టు చేసిన మట్కా బీటర్లతో టుటౌన్ సీఐ సదాశివయ్య, సిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పోలీసు సబ్‌డివిజన్‌లో అసాంఘిక కార్యకలాపాలు అయిన పేకాట, మట్కా తదితర వాటిపై పోలీసులు ముమ్మర దాడులు చేపట్టారు. శుక్రవారం అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వాటిపై వివిధ రకాల తనిఖీలు, సోదాలు, దాడులు చేపట్టారు. ప్రొద్దుటూరు కేంద్రంగా సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై 'అసాంఘికాల జోరు... ఆగని మట్కా, జూదం, బెట్టింగ్ అనే కథనం శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో డీఎస్పీ భావన ఆధ్వర్యంలో త్రీటౌన్ సీఐ వేణుగోపాల్ తమ సిబ్బందితో కలిసి జమ్మలమడుగు రోడ్డులో ఉన్న జార్జి క్లబ్‌లో దాడులు నిర్వహించారు. క్లబ్‌లో సోదాలు చేపట్టి అక్కడ నిర్వహిస్తున్న పేకాటను బంద్ చేయించారు. చట్టవ్యతిరేకంగా పేకాట నిర్వహిస్తే చర్యలు తప్పవని నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు. టుటౌన్ సీఐ సదాశివయ్య ఆధ్వర్యంలో శ్రీనివాసనగర్‌కు చెందిన షేక్ గఫార్ అలియాస్ గన్నా అనే మట్కా నిర్వాహకుడితో పాటు షేక్ కరిముల్లా, షేక్ నాయక్, కె.రఘు, సన్నముత్యాలు, పొట్టిపాడు నీలాధర్, సయ్యద్‌ఖాజా, సి.సుబ్బయ్యలను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి మట్కా స్లిప్‌లు, ఆరు సెల్‌ఫోన్లతోపాటు రూ.10,170 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తాలూకా సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో పట్టణ శివారులోని రాజేశ్వరి కాలనీలో ఉన్న సుందరాచార్యుల క్లబ్‌ను పరిశీలించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మట్కా, గ్యాంబ్లింగ్ నిర్వాహకుల కదలికలపై వన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో గట్టి నిఘా ఉంచినట్లు తెలిపారు. నేరాల కట్టడికి ప్రజలు సహకరించాలని పోలీసులు కోరారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఆదా

● సబ్‌కలెక్టర్ కల్యాణి



వస్తువుల ప్రదర్శనలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

మదనపల్లెటౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో దేశ ప్రజలకు రూ.2.5 లక్షల కోట్లు ఆదా అవుతోందని సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మిషన్ కాంపౌండులో వాణిజ్య పన్నులశాఖ ఆధ్వర్యంలో తగ్గిన జీఎస్టీతో విక్రయిస్తున్న వస్తువుల ప్రదర్శనను ప్రారంభించిన సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ పన్ను స్లాబుల తగ్గింపుతో 12, 18 శాతం వున్న జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం 5 నుంచి తగ్గించిందన్నారు. నిత్యావసర వస్తువులు, ఔషధాలు, చిన్నకార్లు, ద్విచక్రవాహనాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులు, తదితర 99 వస్తువుల గురించి వివరించారు. వాణిజ్య పన్నులశాఖ అసిస్టెంట్ కమిషనర్ చిరంజీవి మాట్లాడుతూ గత నెల 22 నుంచి జీఎస్టీ తగ్గింపు అమలులోకి వస్తోందని, జీఎస్టీ ధరలు తగ్గించినా వ్యాపారులు పాత ధరల ప్రకారం విక్రయిస్తే తమ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.సులోచన, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, జీఎస్‌టీఓ శివప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే జగన్ డ్రామాలు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



మీడియాతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

మదనపల్లెటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీని ప్రజలు మరచిపోతున్నారని, ఆ పార్టీ ఉనికి కోసమే వైఎస్ జగన్ మెడికల్ కళాశాలల వద్ద డ్రామాలు ఆడుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు దుయ్యబట్టారు. శుక్రవారం స్థానిక దేవతానగర్‌లోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గాడి తప్పిన మెడికల్ కళాశాల నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందించేందుకు చంద్రబాబు పీపీపీ విధానం అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. కల్తీ మద్యం విషయంలో చంద్రబాబు నిక్కచ్చిగా వ్యవరిస్తున్నారన్నారు. తప్పు చేసిన ఎంతటి వారైనా ఉపేక్షించడం లేదన్నారు. ఒక్క అవకాశం అంటూ ఐదేళ్ల పాటు అధికారం చలాయించిన జగన్ ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నారని, ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నారన్నారు. నెలకు రూ.2లక్షల జీతం తీసుకుంటున్న వైసీపీ ఎమ్మెల్యేలు నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్, టౌన్ బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్, గుత్తికొండ త్యాగరాజు, రాటకొండ మధుబాబు, లీతఫ్, శ్యామల పాల్గొన్నారు.

గ్రామకంఠం ఆక్రమణపై ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కొండయ్యగారిపల్లె ప్రభుత్వ పాఠశాల వెనుక వైపు ఉన్న గ్రామకంఠంలో సర్వే నంబరు 644లో ఉన్న 4.21 సెంట్ల భూమిని కొందరు కబ్జా చేసి కంచె ఏర్పాటు చేసుకుంటున్నారని గ్రామస్థులు తహసీల్దార్ శ్రీరాములనాయక్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పూర్వం ఇక్కడ కోట ఉండేదని ఆ కోటను ధ్వంసం చేసి అక్కడ కొందరు నిర్మాణాలను సైతం చేపట్టారన్నారు. గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా నామమాత్రంగా చర్యలు తీసుకోవడంతో అక్రమణదారులు మళ్లీ ఆక్రమించేందుకు సిద్ధపడుతున్నారని ఆరోపించారు. గ్రామకంఠం భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని తమ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు క్రీడామైదానం, అంబేడ్కర్ భవన నిర్మాణానికి భూమిని కేటాయించాలని అధికారులను గ్రామస్థులు కోరారు. కాగా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు ఇదే విషయమై రిజిష్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఇక తాలూకా పక్కనే డీఎస్పీ కార్యాలయం



డీఎస్పీ కార్యాలయం నిర్మాణానికి చదును చేస్తున్న స్థలం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె డీఎస్పీ కార్యాలయం.. మదనపల్లె పట్టణం, తాలుకా పోలీసుస్టేషన్ సమీపంలో ఏర్పాటు చేయనున్నట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం ఇందుకోసం ఎంపిక చేసిన స్థలంలో ఎక్స్‌కవేటర్లతో చదును చేయించారు. త్వరలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లితో శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. ఇక్కడ ఏర్పాటు చేయడంతో అందరికీ అందుబాటులో డీఎస్పీ కార్యాలయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐలు కళా వెంకటరమణ, మహమ్మద్‌రఫీ, ఎస్‌ఐలు అన్సర్‌బాషా, శివకుమార్‌లు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తాం

● శ్రీశైల ఆలయ చైర్మన్ రమేష్‌నాయుడు

గుర్రంకొండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ కోటలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం, గణపతి, ఆంజనేయస్వామి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని శ్రీశైల ఆలయ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు అన్నారు. అమిలేపల్లె వద్ద శుక్రవారం జరిగిన అక్కదేవతల పెద్ద పూజకు హాజరైన ఆయన మాట్లాడుతూ కోటలోని నరసింహస్వామి ఆలయం, గణపతి, ఆంజనేయస్వామి ఆలయాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను తెప్పించి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. భక్తులకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేయించి భక్తిమార్గాన్ని పెంపొందిస్తామన్నారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. నిర్వాహకులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్, పొత్తూరి శ్రీకాంత్, రామాంజులు, శేషాద్రినాయుడు, కిశోర్, జీవన్‌కుమార్, భరత్, అమరనాథ్, రాజశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అక్కదేవతల పూజలో పాల్గొన్న చైర్మన్ రమేష్ నాయుడు

ఆ ప్రాజెక్టుకు ఒక్కరే దిక్కు

- ఏళ్ల తరబడి నియమించని సిబ్బంది
- వైసీపీ పాపాలే నిదర్శనం
- కూటమి ప్రభుత్వంలోనైనా తగిన సిబ్బంది వచ్చేనా?



పింఛా ప్రాజెక్టు

సుండుపల్లె, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టుల్లో పింఛా (యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి) జలాశయం ఒకటి. ప్రస్తుతం పింఛా ప్రాజెక్టు వర్షపు నీటితో కళకళలాడుతోంది. గత వైసీపీ పాలనలో సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోకపోవడం వలన పింఛా ప్రాజెక్టుకు శాపంగా మారింది. వేల ఎకరాల సాగు భూమికి సాగునీటిని అందించే ప్రాజెక్టుకు దిక్కే లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టులకు నీటి సంఘం ఎన్నికలు నిర్వహించకపోవడం వలన ప్రాజెక్టు కాలువలు, చెరువులు, కుంటలు ధీనస్థితికి చేరాయి. నీటి సంఘం అధ్యక్షులు నియామకం జరగకపోవడం, ప్రాజెక్టులు అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవడంతో పింఛా అభివృద్ధికి దూరమైంది. పైగా గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రాజెక్టుకు తగిన సిబ్బందిని ప్రభుత్వాలు నియమించకపోవడం ప్రధాన సమస్యగా మారింది.

ప్రాజెక్టు.. ఎప్పుడు ఎలా కట్టారంటే

1954వ సంవత్సరంలో మొదలు పెట్టి ఈ ప్రాజెక్టును 1960వ సంవత్సరంలో పూర్తి చేశారు. 1961 నుంచి పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేయడం ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు సముద్ర నీటి మట్టానికి 965 అడుగుల ఎత్తులో ఉంది. 965 అడుగుల నుంచి 1004 అడుగుల ఎత్తు వరకు ప్రాజెక్టును నిర్మించారు. ప్రాజెక్టు మొత్తం సామర్థ్యం 0.327 ఎఫ్‌టీఎంసీలు. ఈ ప్రాజెక్టు కింద అధికారికంగా సుమారు 4 వేల ఎకరాల సాగు భూమి ఉంది. ఈ ప్రాజెక్టుకు రెండు ప్రధాన కాలువలు కలవు. కుడి, ఎడమ కాలువల ద్వారా ప్రాజెక్టులోని నీటిని రైతులకు అందిస్తారు. కుడికాలువకు 17 తూములు, ఎడమ కాలువకు రెండు బ్రాంచ్ ఛానల్స్ కలవు. మొత్తం అధికారికంగా 14 తూముల ద్వారా పంటలకు నీరు అందిస్తున్నారు.

ప్రాజెక్టుకు ఒక్కరే దిక్కు

ప్రాజెక్టు నిర్మించిన సమయంలో ఒక ఏఈఈతో పాటు ముగ్గురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు, 10 మంది లస్కర్‌లు, ఒక ఎలక్ట్రీషియన్, ఒక ఫిట్టర్, ఒక వాచ్‌మెన్ ఉండేవారు. ప్రస్తుతం పింఛా ప్రాజెక్టుకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తప్ప ఎవరూ లేరు. వేల ఎకరాల సాగు భూమికి సాగునీటిని అందించే ప్రాజెక్టుకు తగినంత సిబ్బంది లేకపోవడం ప్రాజెక్టుకు తీరని నష్టాన్ని కలుగజేస్తోంది. ప్రస్తుతం ఒక అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాత్రమే ఉన్నారు. లస్కర్లు లేకపోవడం వలన ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా సాగుకు నీటిని విడుదల చేస్తే ఆ నీరు రైతులకు పుష్కలంగా చేరే పరిస్థితి కనిపించడం లేదు. అధికారులు కూటమి ప్రభుత్వంలోనైనా కళ్లు తెరిచి ప్లస్ కార్లను నియమించాలని రైతులు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి

- అమ్మనాయక్, ఉత్తమ రైతు, ఆరోగ్యపురం



సిబ్బంది కొరత ప్రాజెక్టుకు శాపంగా మారింది. సిబ్బంది ఉంటే ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాలువలకు నీరు విడుదల చేసినప్పటి నుంచి చివరి ఆయకట్టు రైతుకు నీరు చేరే వరకు బాధ్యత వహిస్తారు. కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోతున్నాయి. కూటమి ప్రభుత్వం సిబ్బందిని నియమించాలి.

సిబ్బంది కొరత

- నాగేంద్రనాయక్, ఏఈఈ, పింఛా ప్రాజెక్టు



పింఛా ప్రాజెక్టుకు సిబ్బంది కొరత ఉంది. సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కనీసం నలుగురు సిబ్బందిని ప్రాజెక్టుకు నియమిస్తే బాగుంటుంది.

ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరగరాదు: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీసర్కిల్), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు ఎక్కడా అన్యాయం జరగరాదని, జిల్లాలోని సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఎస్పీ ధీరజ్ కునుబిల్లితో కలిసి కలెక్టర్ నిశాంత్‌కుమార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన కేసుల్లో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన కేసులను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను, డీఎస్పీలను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని, దాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల బర్తీకి సంబంధించిన ఉమ్మడి జిల్లాలైన కడప, చిత్తూరులో పూర్తి చేయాలన్నారు. కాగా వాల్మీకిపురానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు దాదాపు 600 ఉన్నాయని, శ్మశానవాటికలు లేక నిమ్మనపల్లి రోడ్డులోని బాహుదానదిలో ఖననం చేస్తున్నారని, వర్షాలు పడితే ఇబ్బందులకు గురికావాల్సి వస్తున్నదని, వీలైనంత త్వరగా శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని డీవీఎంసీ కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కోరారు. దీనికి సంబంధించి రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన కేసులకు సంబంధించి ఎక్కడా అన్యాయం జరగకుండా పోలీసుశాఖ తరఫున చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా అటవీశాఖ అధికారి, సాంఘీక సంక్షేమశాఖ అధికారి దామోదర్‌రెడ్డి, మదనపల్లి, రాజంపేట డివిజన్ల డీఎస్పీలు, డీఆర్డీఏ పీడీ, వ్యవసాయశాఖ అధికారి, డీవీఎంసీ కమిటీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలతో ఆరోగ్యవంతమైన సమాజం

● రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు



గర్భిణులకు సీమంతం చేస్తున్న రుకియా బేగం, ఐసీడీఎస్ అధికారులు

పీలేరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం సాకారమవుతుందని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ రుకియా బేగం పేర్కొన్నారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, రాష్ట్ర మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పీలేరు పంచాయతీ కార్యాలయంలో జరిగిన పోషణ్ మాహ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక కార్యక్రమాలకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పునాదులు ఏర్పడుతున్నాయన్నారు. కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంరక్షణకు అంగన్‌వాడీల్లో అందుతున్న సేవలు ఎనలేనివని, అంగన్‌వాడీ కార్యకర్తలు అవిశ్రాంత కృషి కారణంగా లక్షలాది మంది తల్లులు, చిన్నారులు ఆరోగ్యవంతులుగా తయారవుతున్నారన్నారు. సొంత కుటుంబాలను పక్కనపెట్టి విధి నిర్వహణలో భాగంగా ప్రజల పిల్లల్ని సొంత పిల్లల్లా చూసుకుంటూ వారిని భావి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతారని కొనియాడారు. ఆరోగ్యవంత సమాజాన్ని నిర్మించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా సెప్టెంబరు 12 నుంచి అక్టోబరు 12 వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ తమ పరిధిలోని ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'పోషణ్ మాహ్'లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి అందులోని పోషకాహార తినుబండారాల గురించి అడిగి తెలుసుకున్నారు. పలువురు గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ రాజమ్మ, అధికారులు అనురాధ, స్వరూప, ఉమ, స్వర్ణ, అక్కాయమ్మ, శాంత, అన్నపూర్ణ, యశోదమ్మ, పీలేరు, కేవీపల్లె, కలకడ మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు.. సత్యసాయి జిల్లా, కదిరి మండలం, సున్నపుగుట్ట తండాకు చెందిన భాగ్యమ్మ(35) సెప్టెంబరు నెలలో తన తమ్ముడు తిరుపతిలో ఉన్న భాస్కర్‌నాయక్ ఇంట్లో ఉంటూ అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందిందన్నారు. ఆరోగ్యం చూపించుకుని గత నెల 24 తేది నుంచి మదనపల్లె పట్టణం, బుగ్గకాలువలో తన స్నేహితురాలు పూర్ణ ఇంట్లో ఉండేది. అనంతరం ఈ నెల 7 నుంచి కనిపించడం లేదని, ఆమె తమ్ముడు భాస్కర్‌నాయక్ గురువారం ఫిర్యాదు చేయగా శుక్రవారం అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్యారమ్స్ పోటీలు ప్రారంభం



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో యంగ్ మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా లెవల్ క్యారమ్స్ పోటీలను శుక్రవారం ఎంపీపీ మేడా విజయ భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ బీఎన్ శంకర్, సభ్యులు ఆర్ముగం విశ్వనాథ్, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, వేపగుంట స్వామాజ్, నాగభూషణం, శివకోటి, గురుప్రసాద్, జంగంశెట్టి హరిప్రసాద్, ముమ్మడిశెట్టి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.60 కోట్లతో భవన నిర్మాణం



ముష్టూరు కస్తూర్బా పాఠశాల ఆవరణంలో నిర్మిస్తున్న ఇంటర్మీడియట్ భవన నిర్మాణం

నిమ్మనపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ముష్టూరులో వున్న కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ విద్యార్థినుల కోసం రూ.1.60 కోట్లతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు సమగ్రశిక్షా అభియాన్ ఏఈ నాగభూషణం, ప్రిన్సిపాల్ మునివెంకటమ్మ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కస్తూర్బా పాఠశాలలో తల్లిదండ్రులను కోల్పోయి మధ్యలోనే చదువు మానేసి ఇంటి దగ్గర వున్న విద్యార్థినులను చేర్పించి వారికి నాణ్యమైన విద్యను అందివ్వడమే ప్రభుత్వ ముఖ్యఉద్దేశమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోని రాగానే రూ.90 లక్షలతో ప్రహరీ నిర్మించిందన్నారు. ఇంటర్మీడియేట్ ప్రవేశ పెట్టడంతో పాఠశాలలో గదుల సరిపోడం లేదన్నారు. దీంతో ప్రభుత్వం సమగ్ర శిక్షా అభియాన్ కింద ఇంటర్ తరగతులకు నూతన భవనం ఏర్పాటుకు అనుమతులు ఇచ్చి రూ.1.60 కోట్లను మంజూరు చేసిందన్నారు. కాగా నెల రోజులుగా భవన నిర్మాణ పనులు ఊపందుకున్నాయని త్వరలోనే భవనం నిర్మించి ఇంటర్ తరగతులు ప్రాంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు బ్రేక్

వీరబల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో ఉన్న మాండవ్యనది నుంచి ఇసుక అక్రమ రవాణా చేయకుండా స్థానికులు అడ్డుకున్నారు. నదిలోకి ట్రాక్టర్లు వెళ్లకుండా శుక్రవారం జేసీబీ సాయంతో దారికి అడ్డంగా మట్టితో అడ్డుకట్ట వేశారు. ఇసుక అక్రమ రవాణా ఇలాగే కొనసాగితే తాగడానికి నీళ్లు ఉండవని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికటాలని కోరుతున్నారు.



మాండవ్యనదిలోకి ట్రాక్టర్ రాకుండా జేసీబీతో అడ్డుకట్ట వేస్తున్న గ్రామస్థులు

గంజి పోసుకుని.. చిన్నారికి గాయాలు



గంజి పోసుకుని గాయపడిన ఐదేళ్ల చిన్నారి

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గంజి శరీరంపై పోసుకుని ఓ చిన్నారి గాయపడిన సంఘటన ములకలచెరువు మండలంలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. ములకలచెరువు మండలం, వేపూరికోట పంచాయతీలోని నాగ రాజ, సుభాషిణిల కుమారుడు రుక్విత్(5) శుక్రవారం ఇంట్లో ఆడుకుంటూ ఒంటిపై గంజి పోసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు చిన్నారిని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

చోరీ కేసులో బాలురు అరెస్టు

గుర్రంకొండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణం చోరీ కేసులో ఇద్దరు బాలురలను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. గత నెల 17వ తేదీన పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో చోరీ జరిగిన విషయం తెలిసిందే. అప్పట్లో ఈ చోరీపై పోలీసులు కేసు నమోదు చేసి పలు విధాలా దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో గుర్రంకొండ వాసులు ఇద్దరు బాలురు చోరీ చేసినట్లు గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి తిరుపతి బాలనేరస్థుల శిక్షణా కేంద్రానికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

మదనపల్లెటౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బాలికల ఆరోగ్య పరిరక్షణకు తల్లిదండ్రులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు ప్రాధాన్యత ఇవ్వాలని సీడీపీఓ నాగవేణి పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా హోప్ ఉర్దూ హైస్కూల్లో నిర్వహించిన సమావేశంలో సీడీపీఓ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనపై అమ లు చేస్తున్న చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ఏసీడీపీఓ సునీత మాట్లాడుతూ కౌమార దశ బాలికలకు ఆరోగ్య సూత్రాలు వివరించాలని, బాలికల హక్కు ల గురించి తెలియజేయాలన్నారు. వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన

బి.కొత్తకోట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బెంగళూరు రోడ్డు, బాబా టాకీస్ ఏరియాలో తాగునీటి సరఫరా లేదంటూ శుక్రవారం మహిళలు నడిరోడ్డుపై నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ నగర పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని వాపోయారు. రోడ్డుకు అడ్డంగా ఖాళీబిందెలతో మహిళలు బైఠాయించారన్న సమాచారంతో సీఐ గోపాల్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. అధికారులతో మాట్లాడి నీటి సరఫరాను తాత్కాలికంగా పునరుద్ధరించారు. ప్రభుత్వ తాగునీటి పథకం బోరుమోటారు మరమ్మతులకు గురవడంతో సమస్య తలెత్తిందని సిబ్బంది సీఐకి వివరించారు. దీంతో మహిళలు శాంతించి వెనుదిరిగారు.



ఖాళీబిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు



'ఆమె'కు అనారోగ్యం!

- స్వస్థనారీ లక్ష్యంగా.. సేవలు అందించగా
- క్యాన్సర్, రక్తపోటు, మధుమేహ బాధితులు అధికం
- వైద్య శిబిరాల్లో ప్రాథమికంగా గుర్తింపు

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబ బాధ్యతలలో తలమునకలైన అతివలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్యశిబిరాల్లో బహిర్గతమైంది. మహిళలకు మెరుగైన సేవలు, ఆరోగ్య పరిరక్షణ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందడుగు వేశాయి. ఆరోగ్యవంతమైన మహిళ-శక్తివంతమైన కుటుంబం సహకారం లక్ష్యంగా గత నెల 17 నుంచి ఈనెల 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వైద్య, ఆరోగ్యశిబిరాలు నిర్వహించారు. సాధారణ పరీక్షలతో పాటు గర్భిణీలకు ప్రశూతి చెకప్‌లు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ముక్యాన్సర్, ఓరల్ క్యాన్సలర్లకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కంటి పరీక్షలు, పౌష్టికాహారం, రక్తహీనత నివారణ, ఆరోగ్య జీవన శైలి గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను చేపట్టారు. శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులతోపాటు అన్ని పీహెచ్‌సీలలోని వైద్యాధికారులతో ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించి మహిళల ఆరోగ్యంపై నివేదికలు సిద్ధం చేశారు. ఐసీడీఎస్ సహకారంతో గర్భిణీలు, బాలింతలు, కౌమారదశ బాలికలకు పౌష్టికాహారం, పరిపూర్ణ ఆహార భద్రత వంటి వాటిపై జాగృతి చేశారు. ఈ వైద్యశిబిరాలలో క్యాన్సర్, రక్తపోటు, మధుమేహం బారిన పడి ఎక్కువ మంది మహిళలు ఇబ్బందులు పడుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. రక్తహీనత సమస్య మహిళలను ప్రధానంగా వెంటాడుతోంది.

కడప జిల్లా వ్యాప్తంగా 479 వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వీటిలో 387 శిబిరాలు విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల ద్వారా, మిగిలినవి పీహెచ్‌సీలు, యూపీఎస్‌సీ, సీహెచ్‌సీ, ఏహెచ్, డీహెచ్, జీజీహెచ్‌లలో వైద్యశిబిరాలను నిర్వహించి లక్ష మందికిపైగా మహిళలకు పరీక్షలు చేపట్టారు. వీరిలో మధుమేహం 37,999, రక్తపోటు 39,979 మంది, నోటిక్యాన్సర్ 23,490, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ 15,848, బ్రస్ట్ క్యాన్సర్ 21,724 మందికి ప్రాథమికంగా స్క్రీనింగ్ టెస్ట్‌లను నిర్వహించారు. 3,135 మందికి టీబీ పరీక్షలు, గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలు, మహిళలు 33,036 హిమోగ్లోబిన్ పరీక్షలు, 551 మందికి సికిల్‌సెల్ అనిమియా ఉన్నట్లు గుర్తించారు. ఏబీడీఎం, పీఎంజేఎవై రిజిస్ట్రేషన్లు 4,282 చేయించగా 13,775 మంది ఇతర వైద్యసేవలు పొందారు. వివిధ దశల్లో ఉన్న 6,161 మంది గర్భిణులకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం, సమతుల్య ఆహారం, టీకా, మానసిక, శారీరక శుభ్రత, శరీర దారుఢ్యం వంటి ఆరోగ్యకరమైన రోజువారి ఆచారాలను జీవితంలో సమ్మేళనం చేసుకునేలా ప్రోత్సహించారు. 425 మందికి ఎంసీపీ కార్డులను జారీ చేశారు.

తాజాగా మహిళలకు ప్రత్యేకంగా నిర్వహించిన ఈ వైద్యశిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నట్లు గుర్తించారు. ఇప్పటికే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితోపాటు కొత్తవారికి శిబిరాల్లో పరీక్షలు నిర్వహించారు. అనారోగ్య సమస్యలకు ప్రధానంగా మానసిక, శారీరక ఒత్తిడి, జంక్‌ఫుడ్, నిద్రలేమి, వ్యాయామం లేకపోవడం, అధిక బరువు, జన్యుపరమైన కారణాలని వైద్యులు చెబుతున్నారు.



జీవన శైలిలో మార్పు చేసుకుంటే..

భర్త, పిల్లలు, అమ్మానాన్నలని కంటికి రెప్పలా ఎలా కాపాడుకుంటారో అదే విధంగా తమ ఆరోగాన్ని పదిలం చేసుకునేందుకు మహిళలు జాగ్రత్తలు పాటించాలి. జీవన శైలిలో మార్పులు రావాలి. రోజుకు 40 నిమిషాలపాటు వ్యాయామం చేయడం, ఇంటిలోనే కొంత సమయం యోగా, ధ్యానం వంటివి అలవాటు చేసుకోవాలి. ఉప్పుకారం తగ్గించి పండ్లు, ఆకు కూరలు, మిల్లెట్ల వాడకాన్ని పెంచాలి.

- డాక్టర్ శశిభూషణ్, జిల్లా నోడల్ ఆఫీసర్,స్వస్థనారీ, సశక్త్‌పరివార్ అభియాన్

ఉల్లి పంటను కనీస మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలి : ఎంపీ



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, నేతలు

కడప కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉల్లి పంట సాగు చేసిన రైతులు గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు పడుతున్నారని, కనీస మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చే యాలని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాశ్‌రెడ్డి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరిని కలిసి వినతి పత్రం అందజేశారు. శనివారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాద్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాష, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డితో కలసి కలెక్టరేట్‌కు వెళ్లి రైతుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ ఉల్లి పంట క్వింటా రూ.1200లతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉల్లి పంట కొనుగోలు కేంద్రాలు మైదుకూరు, కమలాపురంలో ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారని, ఫోన్ చేస్తే స్పందించే వారు లేరన్నారు. కర్నూలు జిల్లాలలో హెక్టారుకు రూ.50వేలతో కొనుగోలు చేస్తున్నారని, జిల్లాలో కూడా అమలు చేయాలన్నారు. ఈనెల 15లోగా ప్రభుత్వం స్పందించకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగలు అరెస్టు

మైదుకూరు అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప, నెల్లూరు జిల్లాలలో పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులకొట్టి అందులో ఉన్న రాగి తీగలను చోరీ చేసే ఆరుగురు అంతర్ జిల్లా దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. నెల్లూరు జిల్లా అక్కమాంబపురం పొదలకూరులకు చెందిన వెంకటే శ్వర్లు, రాజేష్‌లు రాజంపేట మండలం మందపల్లిలో కల్లు తీసుకొని జీవనం సాగించేవారు. అన్నమయ్య ప్రాజెక్ట్ మునకలో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులకొట్టి అందులో ఉన్న కాపర్‌వైర్ అమ్ముకోవడం ద్వారా సులభంగా డబ్బులు రావడం గమనించారు. వీళ్లు తమ స్నేహితులైన పంది శ్రీనివాసులు, పులగల చిన్నమస్తానయ్య, ఉయ్యాల పోతురాజు, గంగోడి దేవకుమారుతో కలిసి మైదుకూరు డివిజన్ పరిధిలో పగలు సమయంలో మోటారు సైకిళ్లలో రెక్కి నిర్వహిస్తారు. రాత్రి సమయంలో వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులకొట్టి అందులో ఉన్న కాపర్‌వైర్‌ను కొంత అమ్ముకునేవారు. మిగతా కాపర్‌వైర్‌ను కరిగించి ముద్ద లుగా చేసి విక్రయించేవారు. ఈక్రమంలో బ్రహ్మంగారిమఠం వద్ద ఈశ్వరీదేవి గుహ సమీపంలో ఉండగా అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వీరి వద్ద నుంచి సుమారు రెండు లక్షలు విలువచేసే 150 కేజీల రాగివైర్లు, 150 కిలోల బరువుగల కరెంటు తీగలను, మూడు మోటారు సైకిళ్లు, ఒక అశోక్ లైలాండ్ గూడ్స్ వాహనం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కాగా, వీరికి 19 కేసులలో ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలిందన్నారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సీఐ రమణారెడ్డి, ఎస్‌ఐలు చిరంజీవి, సుబ్బారావు, శివప్రసాద్, సిబ్బందిని అభినందించారు.



అరెస్టు చేసిన నిందితులను చూపుతున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

ప్రైవేటు రంగంలో స్థానిక రిజర్వేషన్లు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రైవేటు రంగంలో 75 శాతం స్థానిక రిజర్వేషన్లను అమలు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఎన్జీవో హోంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ ఆధ్వర్యంలో జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ 2019లో 75 శాతం స్థానిక రిజర్వేషన్లను అమలు చేస్తూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రైవేటు కంపెనీలు భూములు, రాయితీలు, సబ్సిడీలు పొందుతూభారీగా ప్రయోజనం పొందుతున్నాయని తెలిపారు. ప్రైవేటు సంస్థలు స్థానిక ప్రజలకు రిజర్వేషన్ సౌకర్యం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు సాంఘిక, రాజకీయ ఆర్థిక రంగాల్లో రాజ్యాధికారం సాధించడానికి ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. భూమిలేని పేదలకు సాగుభూమి, ఇంటి స్థలం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దరాజు, నాగేంద్ర, నారాయణస్వామి, పసుపులేటి శివక్రిష్ణ, చంద్రబాబు, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలితో జీవన ప్రమాణాలు మెరుగు



మాట్లాడుతున్న హైదరాబాద్‌కు చెందిన వెల్నెస్ కోచ్ జేసీ రెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చక్కటి జీవనశైలి, ఆరోగ్యకరమైన అలవాట్లు, సహజ సిద్ధమైన ఉత్పత్తులతో తయారైన మందులను వినియోగించి ఆయు ప్రమాణాన్ని పెంచుకోవచ్చని హైదరాబాద్‌కు చెందిన వెల్నెస్ కోచ్ జేసీ రెడ్డి తెలిపారు. శుక్రవారం యోగివేమన విశ్వవిద్యాలయం సైన్స్ బ్లాక్ సెమినార్ హాల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్ల అల్లం దుంపల సారంతో సహజ సిద్ధమైన క్యాప్సస్ రూపంలో ఉన్న ఈఆర్-4 మందు, బీపీ, థైరాయిడ్, క్యాన్సర్, కీళ్ల నొప్పులువంటి వ్యాధులకు చక్కగా పనిచేస్తుందన్నారు. ఈ మందును ప్రతి ఒక్కరు వినియోగించవచ్చన్నారు. మలేషియా కేం ద్రంగా వెల్టాన్ ఇంటర్నేషనల్ సంస్థలో తయారైన ఈ మందు గురించి పరిశోధకులు 104 పరిశోధన పత్రాలను రాసి ధ్రువీకరించారన్నారు. భారత్‌లో ప్రవేశించి రెండేళ్లు పూర్తయిందన్నారు. మన శరీరంలో ఉన్న అన్ని రకాల విష పదార్థాలను బయటకు పంపించి ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. కణాల డ్యామేజ్‌ను తగ్గించి కొత్త కణాలను అభివృద్ధి చేసి సంపూర్ణ ఆరోగ్యా న్ని ఇస్తుందన్నారు. నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తోందన్నారు. అనంత రం ఆయన పలువురి సందేహాలను నివృత్తి చేశారు. విశ్వవిద్యాలయం జన్యుశాస్త్రశాఖ సహ ఆచార్యులు డాక్టర్ ఎల్.దాక్షాయణి, భూగర్భ శాస్త్రశాఖ ఆచార్యులు ప్రొఫెసర్ వి.సునీత ఆధ్వర్యంలో జరగిన ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసీ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ, ప్రొఫెసర్ చంద్రమతి శంకర్, పీఆర్ సెల్ డైరెక్టర్ డాక్టర్ సరిత, ఆచార్య మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

పులివెందుల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణానికి చెందిన వినయ్‌కుమార్ (35) అప్పులబాధ తాళలేక విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే.... పులివెందుల పట్టణంలోని నగరిగుట్టకు చెందిన వినయ్ అప్పులు ఎక్కువ కావడంతో బుధవారం బీరుబాటిల్లో విషద్రావణం కలుపుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన చుట్టుపక్కల వారు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కడపకు రెఫర్ చేశారు. గురువారం అర్థరాత్రి ప్రాంతంలో వినయ్ మృతి చెందారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన

వినయ్ మృతికి పులివెందులలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణమని మృతుడి బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకొని పరిస్థితి అదుపులోకి తెచ్చారు. అయితే ఆసుపత్రి సిబ్బంది మృతుడి కుటుంబ సభ్యులతో చర్చలు జరపడంతో వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఇందుకు యాజమాన్యం కొంత డబ్బు ముట్టజెప్పి పంపించినట్లు సమాచారం. ఈ సంఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

విషద్రావణం తాగి వృద్ధుడు...

కలసపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దంవారిపల్లెకు చెందిన కొండెపోగు ప్రకాశం (60) అనే వృద్ధుడు విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, పోలీసుల వివరాల మేరకు.. గత కొంతకాలంగా అనారోగ్యానికి గురైన ప్రకాశంకు మతిస్థిమితం కూడా సరిగా లేదు. దీంతో గురువారం విషద్రావణం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కడప - తాడిపత్రి ఈత చెట్టు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పుల్లారెడ్డిపేటకు చెందిన భూసిరెడ్డి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు బూసిరెడ్డి తన సొంత పనుల మీద నడుచుకుంటూ వెళుతుండగా వెనుకవైపు కరివేపాకు లోడుతో వెళుతున్న ఐచర్ వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. బంధువులు స్థానిక పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం దుకాణంలో చోరీ

మైదుకూరు అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణం బద్వేల్ రోడ్డులో ఉన్న విజయదుర్గ వైన్స్‌లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. దుకాణం తాళాలు పగులకొట్టి రూ.40వేల నగదు, 10 కేసుల మద్యం సీసాలను దొంగలించారు. శుక్రవారం ఉదయం 10గంటలకు దుకాణం తెరవడానికి వెళ్లిన యజమాని పామిడి నరేంద్రయాదవ్ చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో లారీ దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కడప క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజంపేట బైపాస్ రోడ్డులోని రామాంజనేయపురం వద్ద బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో లారీలోని బ్యాటరీ నుంచి మంటలు చెలరేగి లారీ మొత్తం దగ్ధమైనట్లు కడప అగ్నిమాపకశాఖ అధికారి యోగేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. నెహ్రూనగర్‌కు చెందిన మాలే శివకు చెందిన 14 టైర్ల లారీని రామాంజనేయపురం పెట్రోలు బంకు సమీపంలో పార్కింగ్ చేసి తన డ్రైవరుతో కలిసి ఇంటికి వెళారు. అర్థరాత్రి లారీలోని బ్యాటరీ వద్ద వైర్లు షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారం మేరకు తమ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకున్నారు. బాధితుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని దాదాపు 20లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బస్సును క్రేన్‌తో పక్కకు తొలగిస్తున్న దృశ్యం



ఎర్రగుంట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సుకు ఒక్కసారిగా బ్రేక్ ఫెయిల్ అయ్యింది. అయితే డ్రైవర్ అప్రమత్తతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటన చిలమకూరు సమీపంలో చోటుచేసుకుంది. వివరాలిలా... ప్రొద్దుటూరుకు చెందిన ఏఆర్ ట్రావెల్ బస్సు బెంగళూరు నుంచి ప్రొద్దుటూరు వస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున చిలమకూరు సమీపంలోకి రాగానే బ్రేక్ ఫెయిల్ అయ్యింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ డ్రైవర్ గమనించి లారీని నిలిపాడు. బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి బస్సును రోడ్డుకు అడ్డంగా తిప్పడంతో లారీకి ముందు భాగంలో స్వల్పంగా ఢీకొట్టి ఆగిపోయింది. దీంతో పెద్దప్రమాదం తప్పింది. బస్సులో 12మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రోడ్డుకు అడ్డంగా బస్సు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్‌జాం అయ్యింది. సీఐ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు క్రేన్ సహాయంతో బస్సును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

జీఎస్టీ 2.0 అమలును ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి



ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జ్ఞానానందరెడ్డి


పులివెందుల రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 అమలును ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని పులివెందుల వాణిజ్య పన్నులశాఖ అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానానందరెడ్డి ప్రజలకు సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్ కమ్ సేల్స్‌లో భాగంగా టీవి, ఏసీ, మానిటర్లు తదితర ఎలక్ట్రానిక్స్ వస్తువలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏసీ జ్ఞానానందరెడ్డి మాట్లాడుతూ వ్యాపారులకు అవగాహనకల్పించడం, టెక్నాలజీ ఆధారిత పన్ను వ్యవస్థను సులభతరం చేయడం ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. ఈ ప్రదర్శన శనివారం కూడా కొనసాగుతుందని వ్యాపారులు, ప్రజలు హాజరై లబ్ధిపొందాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కమిషనర్ రాముడు, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు రాజశేఖర్‌రెడ్డి, పుష్పలీల, స్వరాజ్యలక్ష్మి, మున్సిపల్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి మార్కెట్ యార్డులో ఈ-నామ్

పులివెందుల రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులో ఈనెల 15వ తేదీ బుధవారం నుంచి ఈ-నామ్ వ్యవస్థను అమలు చేస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, మార్కెట్‌యార్డు చైర్మన్ అమర్‌నాథ్‌యాదవ్‌లు తెలిపారు. శుక్రవారం మార్కెట్‌యార్డు కార్యాలయంలో చీనీ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు ఈ-నామ్ అమలుకు బ్రేక్ పడిందని, ఇకపై ఖచ్చితంగా అమలు అవుతుందన్నారు. ఈ-నామ్ వ్యవస్థ అమలైతే చీనీ రైతులు ఎవరూ నష్టపోరన్నారు. రైతులకు ఈ-నామ్ ప్రయోజనాలను తెలియజేయాలన్నారు. ఏడీఏ అజాద్‌వలి, ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి, మార్కెట్‌యార్డు సెక్రటరీ శ్రీధర్ పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్టు

లింగాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండ్లవాగు గ్రామానికి చెందిన చప్పిడి రామాంజనేయులరెడ్డి అనే మట్కా బీటర్‌ను శుక్రవారం అరెస్టు చేశామని ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. రాబడిన సమాచారం మేరకు వెలిదండ్ల, తాతిరెడ్డిపల్లె మార్గమధ్యలో మట్కా రాస్తుండగా పట్టుకున్నామని, అతని వద్ద నుంచి రూ.3200 నగదు, మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు.



సర్వెంట్ కావలెను

సర్వెంట్ కావలెను. 10రోజుల క్రింద జన్మించిన ఇద్దరు పిల్లలు యొక్క అలనా పాలనా చూసుకొనుటకు అనుభవజ్ఞులైన ఆయా కావలెను. జీతం స్కేల్ 10 వేలు నుండి 12 వేలు వరకు, సెల్ : 98497 94289

Ajc-245291

10th,ఇంటర్,డిగ్రీ పాసయ్యే ఛాన్స్

చదువు మధ్యలో ఆపేసిన (లేదా) ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్ కలదు. కడప సెల్ : 90105 01122.

Ajc-249726

CHANGE OF NAME

I SYED RAHIB BASHA (OLD NAME) D.No.17/543,MIASAHEB STREET, NEAR POLERAMMA TEMPLE, KADAPA, YSR DIST, AP. HERR CHANGE MY NAME AS SYED RAQUEEB BASHA (NEW NAME) S/o SYED IBRAHIM SAB. HENCEFORTH I MAY BE CALLED AS SYED RAQUEEB BASHA.

AJC-000

CHANGE OF NAME

I Imtiyaz Basha (Old Name) Passport No.S9509730, Residing at D.No.8/778, Vakkalapeta, Kadapa, YSR Kadapa Dist. changed my name as Sayed Imtiyaz Basha (New Name)

AJC-000

CHANGE OF NAME

I, Syed Sogara (Old Name), D/o. Syed Riyajuddin, R/o: 2/226-R-1, Mahaboob Nagar, Rajampet-516 115, Annamayya Dist, A.P., Hereby Declare That I Have Changed My Name As Syed Soghara (New Name), W/o Syed Abusaleha.

AJT - 1708

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.

AJA- 246743

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

జొన్న పంటకు 'కత్తెర'

పురుగుల బెడదతో ఆందోళనలో రైతులు





కత్తెర పురుగు సోకిన జొన్న పంట

రాజుపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రబీలోసాగైన జొన్న పంటకు కత్తెరపురుగు ఆశించడంతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందళన చెందుతున్నారు. పంటకు మందులు పిచికారి చేసినా పురుగు ఉధృతి తగ్గడం లేదని చెబుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 500 ఎకరాల పైబడి జొన్న పంట సాగులో ఉంది. పంట సాగు చేసి నెలరోజులు అయ్యిందని, కత్తెర పురుగు ఉధృతి ఎక్కువ కావడంతో ఏపుగా పెరగడం లేదని రైతులు వాపోతున్నారు. దీనిపై ఏవో శివరామక్రిష్ణరెడ్డిని వివరణ కోరగా.. జొన్న పంటలో గత మూడేళ్ల నుంచి కత్తెర పురుగు సోకుతోందన్నారు. పురుగుల నివారణకు ఎకరాకు 300 ఎంఎల్ లార్విన్ మందు పిచికారి చేయాలన్నారు. మొక్కలు తడిచే విధంగా మందు పిచికారి చేయడం ద్వారా ఈ పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. అదే విధంగా వాతావరణంలో మార్పు కూడా రావాలని తెలిపారు. పంట రోజులు తక్కువగా ఉన్నందున పురుగు ఉధృతి ఉన్నా దిగుబ డికి ఇబ్బంది ఉండదన్నారు.

కృష్ణదేవరాయలు వర్ధంతికి హాజరుకావాలి

● ఎమ్మెల్యేను ఆహ్వానించిన కృష్ణదేవరాయ బలిజ సంక్షేమ సంఘం



ఎమ్మెల్యే మాధవికి ఆహ్వానపత్రిక అందిస్తున్న శ్రీకృష్ణదేవరాయ బలిజ సంక్షేమ సంఘం సభ్యులు

కడప మారుతీనగర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు 496వ వర్ధంతి కార్యక్రమం ఈనెల 17వ తేదీన కడపలో ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని శుక్రవారం ఎమ్మెల్యే మాధవిని ఆహ్వానించారు. ఈ మేరకు స్థానిక ద్వారకానగర్‌లోని టీడీపీ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానించినట్లు శ్రీకృష్ణదేవరాయ బలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సగినాల శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి

కడప నాగరాజుపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 13వ తేదీన నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న జేఎల్ఎమ్ గ్రేడ్-2 ఉద్యోగులు, కార్మికుల సమస్యలు చాలాకాలంగా ఎలాంటి పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయని, వాటి పరిష్కారానికి తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

పీఎం శ్రీశైలం పర్యటన ఏర్పాట్లపై చర్చ

● నంద్యాల కలెక్టర్‌తో శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కలెక్టర్‌ను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీశైలం పర్యటనను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు, భద్రతా చర్యలపై చర్చించారు. పర్యటన కమిటీ కన్వీనర్‌గా శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు.

బీసీ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడిగా రామచంద్ర



వేంపల్లె, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా బీసీ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడిగా వేంపల్లెకు చెందిన గూడూరు రామచంద్ర నియామకమయ్యారు. ఈ మేరకు ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి రామమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. బీసీల అభ్యున్నతికి, బీసీల సమస్యలపై ఉద్యమించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానని గూడూరు రామచంద్ర తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE: KADAPA
I.A.No. 714/2023
O.S. No. 181 / 2015

T. Mallikarjuna S/o Reddappa, Hindu Aged: 55 Years, Cultivation, Residing at Bayanapalli Village, Chintakommadinne Mandal, Kadapa Dist.. Plaintiff

Vs

1. G. Yagappa S/o annaiah, Hindu, Aged: 43 Years, Cultivation, Residing at Bayanapalli village, Chintakommadinne Mandal, Kadapa Dist .. 11వ రేస్పాండేంట్
2. E.V. Sudhakar S/o Chinna Subbarayudu, Hindu, Aged: 55 Years, Business, Residing at D.No.53/131 Kotthapeta, Rayachoti town and Mandal, Annamaiah Dist. 17వ రేస్పాండేంట్

నోటీసు

పై పిటిషన్‌లో పిటిషనరు రెస్టోర్ పిటిషన్ వేయడంలో జరిగిన ఆలస్యాన్ని మన్నించమని కోరుతూ పై పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు. సదరుపై పిటిషన్‌లో మీకు ఏమైనా అభ్యంతరాలు ఉన్నఎడల 13-10-2025 తేదీన ఉదయం 10:30 గంటలకు, సదరు పిటిషన్‌లో 11వ రేస్పాండేంట్ మరియు 17వ రేస్పాండేంట్లు అయిన మీరు స్వయంగా గాని వకీలు ద్వారాగాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలెను లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

// by order of the Hon'ble court//
V. RAMA MOHAN, K. RAMA MOHAN
B.AKBAR ALI KHAN, KISHAN MANDIRAJU
ADVOCATES, KADAPA.

చిన్న తరహా పరిశ్రమలకు లాభదాయకం

● ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో చిన్న, మధ్య తరహా పరిశ్రమలతో పాటు నిత్యావసర వస్తువులు, పలురకాల వస్తువుల ధరలు తగ్గి సామాన్య ప్రజలకు లాభదాయకమని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. శుక్రవారం అధికారులు, కూటమి నాయకులు, వ్యాపారులతో కలిసి జీఎస్టీ 2.0పై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుకాణదారులు, ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదాయం పెంచి ఖర్చులు తగ్గించాలనే ఉద్దేశంతో మెడిసిన్, రైతుల పనిముట్లు, ట్రాక్టరు, ద్విచక్ర వాహనాలు, పురుగు మందులు, టీవీలు, బట్టలు, సిమెంటుతో పాటు ఆరోగ్య బీమా, జీవిత బీమా, విద్యాసామగ్రిపై కూడా జీఎస్టీ తగ్గించారన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి ఏటా రూ.8వేల కోట్లు నష్టం వాటిల్లుతుందని, అయినా ప్రజలకు మేలు చేయాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. కార్యక్రమంలో కమిషనరు ప్రహ్లాద్, టీడీపీ మండల కన్వీనరు రాఘవరెడ్డి, జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, దివాకరరెడ్డి, పాలగిరి సుబ్బారెడ్డి, పుత్తా ఎల్లారెడ్డి, బాబుల్, దాది రామయ్య, శంకర్‌రెడ్డి, అల్లె రాజారెడ్డి, మాలేపాటి మల్లికార్జున, జలపల్లె శంకర్‌రావు, కామిశెట్టి వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి రూ.1.50లక్షల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్సీ సతీమణి ఉమాదేవి

పులివెందుల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోట్నూతలపల్లె గ్రామానికి చెందిన రెడ్డిబోయిన గంగాధర్ కుటుంబానికి ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవి రూ.1.50లక్షల ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం ఉమాదేవి జన్మదినం సందర్భంగా ఈ ఆర్థికసాయం అందించారు. పులివెందుల సమీపంలో ఆత్మహత్య చేసుకున్న రెడ్డిబోయిన గంగాధర్‌కు ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగపిల్లాడు ఉన్నారు. గంగాధర్ మరణంతో ఆ కుటుంబం దిక్కుతోచని దీనస్థితిలోకి వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆ కుటుంబానికి అండగా ఉంటానని, ఆర్థిక సాయం చేస్తానని మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఆయన సతీమణి జన్మదినం సందర్భంగా ముగ్గురు ఆడపిల్లలకు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున మొత్తం రూ.1.50లక్షల సాయం చేశారు. ఈ సందర్భంగా గంగాధర్ కుటుంబం ఎమ్మెల్సీ కుటుంబానికి రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కొమ్మా శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూల సాహిత్య కృషి ప్రశంసనీయం

కడప కల్చరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి సాహిత్య, కళారంగాలకు చేస్తున్న కృషి ప్రశంసనీయమని చాంద్‌బీ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ పి.ఖాసింఖాన్ కొనియాడారు. జిల్లా రచయితల సంఘాన్ని ప్రారంభించి నిరంతరం సాహిత్య కార్యక్రమాలు చేస్తున్న మల్లికార్జునరెడ్డిని శుక్రవారం కడపలోని ఖాసింఖాన్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. బహుముఖ ప్రజ్ఞ కలిగిన మూల రామాయణం, వీరబ్రహ్మేంద్రస్వామి తాత్విక దార్శనికత, వ్యాస వైజయంతి, మల్లికార్జున శతకం, గోష్టి(వ్యాస సంపుటి) హాస్యవైభవం, కరోనా శతకం, రాయలసీమ నాటక వికాసం, యమసభ, శ్రీశివభక్తేంద్ర స్వామి, రామాయణ, భాగవతంలోని కొన్ని పాత్రలు, గ్రంథాలు రచించడం ఆయనకే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో కవి వెల్లాల వెంకటేశ్వరచారి, తదితరులు పాల్గొన్నారు.

డీబీసీడబ్ల్యూవోపై సమగ్ర విచారణ జరపాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): డీబీసీడబ్ల్యూవోపై వెంటనే విచారణ జరిపి సస్పెండ్ చేయాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం నగరంలోని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ డీబీసీడబ్ల్యూవో పదవిలోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో హెచ్‌డబ్ల్యూవోలపై లంచాల వసూళ్లు, బెదిరింపులు విస్తృతంగా జరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల ప్రతిభ అభినందనీయం

● ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్

కడప మారుతీనగర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి, ఇంటర్ విద్యలో కడప జోన్‌కు సంబంధించి 2024-25 సంవత్సరంలో ఆర్టీసీ ఉద్యోగుల పొదుపు పరపతి సహకార సంఘం లిమిటెడ్‌లో డెలిగేట్స్‌గా ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలు ప్రతిభ కనబరచడం అభినందనీయమని ఆర్టీసీ కడప జోన్ ఈడీ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ సముదాయ సభాభవనంలో జోన్ వ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన సుమారు 40మంది సీసీఎస్ డెలిగేట్స్ పిల్లలకు క్యాష్ అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డెలిగేట్స్ శ్రీనివాసులు, క్రిష్ణతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



క్యాష్ అవార్డ్స్ అందుకున్న పిల్లలతో ఈడీ చంద్రశేఖర్

ఘనంగా గణపతి హోమం



గణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

చెన్నూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలపల్లెలో సీతారామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా రెండోరోజు శుక్రవారం గణపతి హోమం నిర్వహించారు. వాస్తుహోమం, ప్రతిష్ఠ దేవతా యంత్రాలకు రుద్రాభిషేకం, దీక్షాహోమం, నవగ్రహ హోమాలు, లక్ష్మీనారాయణ, సుదర్శన హోమాలు నిర్వహించారు. అలాగే ప్రతిష్ఠమూర్తులకు మహానైవేద్యం సమర్పించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు



పంటను పరిశీలిస్తున్న ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి

చక్రాయపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించి సాగు చేసిన పంటలు ఆరోగ్యకరమని పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని మారెళ్లమడక గ్రామంలో ప్రకృతి వ్యవసాయంతో సాగైన పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం పలువురు రైతులకు ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో భూమికి, మానవాళి మనుగడకు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈవో రమణారెడ్డి, అమరావతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆగిపోయిన అభివృద్ధి పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలి

పులివెందుల టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఆగిపోయిన అభివృద్ధి పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మనోహర్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. శుక్రవారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో పాడా నిధులతో అనేక పనులకు టెండర్లు పిలిచి పనులు చేపట్టారని, ఈ పనులు కొంత మేరకు జరిగాయన్నారు. చాలావరకు పనులు ఆగిపోయాయని, మరికొన్ని టెండర్లు పూర్తిగా నిలిపివేసే పరిస్థితి ఉందని ప్రచారం జరుగుతోందన్నారు. అలాంటి వాటికి అవకాశం లేకుండా గతంలో టెండర్ పిలిచిన పనులన్నీ పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో కొరత లేకుండా మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ల్యాండ్ పార్శిల్స్ నమోదును త్వరగా పూర్తిచేయాలి

లింగాల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న ల్యాండ్ పార్శిల్స్ వివరాలను త్వరగా ఈ-పంటలో నమోదు చేయాలని వ్యవసాయాధికారి రమేశ్ తెలిపారు. మండలంలోని పెద్దకుడాల, బోనాల గ్రామాలలో శుక్రవారం ఆయన పర్యటించి పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రభుత్వ భూములు, పట్టా భూములకు సంబంధించిన 25402 ల్యాండ్ పార్శిల్స్ ఉన్నాయని, ఆ సర్వే నెంబర్లలో పంట సాగుచేసి ఉంటే ఆ వివరాలు, చేయకుంటే బీడు భూమిగా నమోదు చేయాలని సూచించారు. ఈనెల 25లోగా ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.



బీడుభూమి నమోదును పరిశీలిస్తున్న ఏఓ రమేశ్

'నకిలీ మద్యంపై సీబీఐ విచారణ చేయాలి'



ర్యాలీగా వస్తున్న బద్వేల్ ఎమ్మెల్యే సుధ, వైసీపీ మహిళా నేతలు

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎన్-బ్రాండ్ చెలరేగిపోతూ ప్రజలప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ మద్యం తయారీపై సీబీఐ దర్యాప్తు జరపాలని బద్వేలు ఎమ్మెల్యే దాసరి సుధ డిమాండ్ చేశారు. శుక్రవారం కడపలోని ప్రకాష్‌నగర్‌లో ఎక్సైజ్ రీజనల్ కార్యాలయం ఎదుట వైసీపీ జిల్లా నగరమహిళా విభాగాల ఆధ్వర్యంలో మహిళలు పెద్దఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రకాష్‌నగర్ నుంచి ఎక్సైజ్ ప్రొహిబిషన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే సుధ మాట్లాడుతూ మహిళా శక్తి అనే పేరుతో పథకం తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వం, కల్తీ మద్యం ద్వారా మహిళల మంగళసూత్రాలు తెంపుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు తయారు చేసిన నకిలీ లిక్కర్‌తో రాష్ట్ర ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని విమర్శించారు. నకిలీ మద్యం తయారీలో అడ్డంగా దొరికిపోయినా చంద్రబాబు నోరు మెదపకపోగా, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కనిపించడమే లేదన్నారు. కార్యక్రమంలో మహిళా జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకటసుబ్బమ్మ, మహిళా నగరఅధ్యక్షురాలు బండి దీప్తిరెడ్డి, అంగన్వాడీ అధ్యక్షురాలు చైతల్య, కోఆప్షన్ సభ్యురాలు మరియ, సీనియర్ నాయకులు రత్నకుమారి, ఉమామహేశ్వరి, నారాయణమ్మ, తులశమ్మ, భాగ్యమ్మ, నగర ఉపాధ్యక్షురాలు మల్లేశ్వరి, సావిత్రమ్మ, శివమ్మ, సుశీలమ్మ, అనురాధ, శ్రీదేవి పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ అంతరాయం

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో భాగంగా శనివారం కడప నగరంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని కడప టూటౌన్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.లక్ష్మనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా ముత్రాస్‌పల్లె, రెడ్డికాలనీ,ఫకీరుపల్లె, ఓంశాంతినగర్, అబ్దుల్ కలాం కాలనీ,చిన్నచౌక్ విద్యామందిర్ స్కూల్, భాగ్యనగర్ కాలనీ, దేవునికడప, గౌస్‌నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లె రోడ్డు, మాసాపేట,నమస్తే బోర్డు, భారతి బార్, ద్వారకానగర్, సంధ్యాసర్కిల్, ఎర్రముక్కపల్లె, సీపీ బ్రౌన్, మున్సిపల్ ఆఫీస్, ఆర్టీసీ బస్టాండ్, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంకు, బాలాజీ నగర్, అక్కాయపల్లె, నబీకోట, బిల్టప్, విజయదుర్గాకాలనీ, వినాయక్‌నగర్, నకాష్, అల్మాస్‌పేట, వన్‌టౌన్, నాగరాజుపేట, పాతబస్టాండ్, సాయిపేట, ఆర్ఎస్‌రోడ్డు, మరియాపురం, మోచంపేట, అగాడి తదితర ప్రాంతాలలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

'సవాళ్లను స్వీకరించే శక్తి యువతులకు ఉంది'

కడప నాగరాజుపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సవాళ్లను స్వీకరించే శక్తి, అవకాశాలను అందిపుచ్చుకునే యుక్తి ఈతరం యువతులకు ఉందని కోటిరెడ్డి కోటిరెడ్డి రామసుబ్బమ్మ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష అన్నారు. శుక్రవారం కళాశాలలో దేశంలో చదువుకున్న మహిళల ముందున్న అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌ఐసీ శ్రామిక మహిళా కోకన్వీనర్ శ్రీకృష్ణ, యూనియన్ నాయకులు అవధానం శ్రీనివాస్, రఘునాథరెడ్డి మాట్లాడుతూ తమ సంఘం ఏర్పడి 75వ సంవత్సరంలో అడుగుపెట్టిన నేపథ్యంలో ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ గురివిరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థినులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

లింగాల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పట్ల సమీపంలో ఉన్న గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శివకేశమ్మ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ రెండు రోజులుగా మైదుకూరు మేధా డిఫరెంట్ అకాడమీ కళాశాలలో అండర్-19 క్రీడాపోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో 200మీటర్ల పరుగు పందెంలో రెజీనా ప్రథమస్థానం, నాలుగు కిలోమీటర్ల 800 మీటర్ల పరుగుపందెంలో గంగాచరిత ప్రథమ స్థానం, 1500మీటర్ల పరుగులో విజయకుమారి ద్వితీయస్థానం, ట్రిపుల్ జంప్‌లో స్టైలీ ద్వితీయస్థానం, బాల్‌బాడ్మింటన్‌లో జయంతి విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థినులను అభినందించారు.

డివిజనల్ స్థాయికి చైతన్య విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో అండర్-14, 17 విభాగంలో వేంపల్లె చైతన్య హైస్కూల్ విద్యార్థులు డివిజనల్ స్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. పాఠశాల నుంచి మొత్తం 35మంది విద్యార్థులు వాలీబాల్, ఖోఖో, చెస్, బ్యాడ్మింటన్, యోగా, పరుగుపందెం, షాట్‌పుట్, జావెలిన్, డిస్కస్, హైజంప్ వంటి అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరి డివిజన్‌స్థాయికి ఎంపిక అయ్యారన్నారు. ఈ సందర్భంగా పీఈటీలు, విద్యార్థులను ఆయన అభినందించారు.

మహిళల భద్రతకు రక్షణ కవచం శక్తియాప్

కడప క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు రక్షణ కవచం శక్తి యాప్ అని ఎస్‌ఐ శాంతమ్మ అన్నారు. శక్తియాప్ ప్రాముఖ్యతపై శుక్రవారం నగరంలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల వసతిగృహంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు ఆపద సమయాల్లో శక్తియాప్‌ను ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై దృష్టి సారించాలి : ఎస్‌ఐ

సింహాద్రిపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల మధ్య అనుకోకుండా వచ్చే సమస్యలు, ఘర్షణలపై దృష్టి సారించాలని ఎస్‌ఐ రవికుమార్ మహిళా పోలీసులకు సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల పరిధిలో ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే స్టేషన్‌కు సమాచారం ఇస్తే వెంటనే పోలీసులు అక్కడకు వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ముఖ్యంగా ఫ్యాక్షన్ గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

డ్రైవర్లు జాగ్రత్తగా వ్యవహరించాలి

కడప క్రైం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు ఎల్లప్పుడు జాగ్రత్తగా ఉంటూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ట్రాఫిక్ సీఐ డీకే జావీద్ సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో ఆర్టీసీడ్రైవర్లకు 'రోడ్డు ప్రమాదాలు-నివారణ' అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం అంటేనే సురక్షిత ప్రయాణం అన్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయకూడదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందుకు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ భావం పెంపొందించడంలో ఆర్ఎస్ఎస్ కీలకపాత్ర

సింహాద్రిపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): యువతలో జాతీయ భావజాలాన్ని పెంపొందించడంలో ఆర్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తోందని విశ్రాంత ఎంపీడీవో విజయరాఘవరెడ్డి అన్నారు. మండలంలోని నంద్యాలంపల్లిలో శుక్రవారం సాయంత్రం ఆర్ఎస్ఎస్ శతజయంతి విజయదశమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడంలో ఆర్ఎస్ఎస్ ముందంజలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో దేవగుడి భద్రినాథశర్మ, మండల ప్రముఖ్ రాధాకృష్ణారెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, అమర్, అక్కినారాయణరెడ్డి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై నిగ్గు తేల్చాలి

కడప మారుతీనగర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై నిగ్గు తేల్చి జనాభా ప్రాతిపదికన బీసీలకు సమానమైన వాటా కల్పించాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమీపంలో ఉన్న జేసీఐపీ కార్యాలయంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు జేసీఐపీ అసెంబ్లీ అధ్యక్షుడు పి.ఆదినారాయణ, నాయకులు శివ, ప్రసన్నకుమార్, పెంచలయ్య పాల్గొన్నారు.

బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి



కలెక్టరుకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్

కడప మారుతీనగర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.బాలక్రిష్ణ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరును కలిసి వినతిపత్రం అందించారు. కడప కార్పొరేషన్‌లో జరిగిన గత ఎన్నికల్లో రిజర్వేషన్ ప్రక్రియ సరైన రీతిలో జరగలేదన్నారు. కేవలం బీసీలకు 17 సీట్లలో అవకాశం కల్పించారని, ఆ సంఖ్యను ఈసారి మరింతగా పెంచాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా నాయకురాలు పద్మావతిభాయి, నాయకులు శ్రీనివాసులు, సుబ్బరాయుడు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రారంభోత్సవం
జన్మదిన శుభాకాంక్షలు
ప్రమాణస్వీకారం
వివాహ మహోత్సవం
ఉద్యోగ విరమణ
విదేశీయానం
స్వదేశాగమనం
ఇప్పుడు ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి, అందుకు మీ ప్రాంతంలోనే మా ప్రకటనల ప్రతినిధి అందుబాటులో ఉన్నారు సంప్రదించండి.
పొలిటికల్ యాడ్స్
షష్టిపూర్తి మహోత్సవం
సినిమా యాడ్స్
శ్రద్ధాంజలి
లీగల్ యాడ్స్
ప్రభుత్వ ప్రకటనలు
క్లాసిఫైడ్స్
ప్రకటనలపై జి.యస్.టి. 5% అదనం
యూనిట్ కార్యాలయం
సర్వే నెం. 137 & 138/3, చిన్నమాచుపల్లె చెన్నూరు మండలం, కడప.
Cell: 9985411183, 9985411193, 9985411189.
ప్రాంతీయ కార్యాలయాలు :
కడప: Cell : 99854 11192, 99854 10691, 99854 02134
కమలాపురం : 9985411183 ప్రొద్దుటూరు : 9985921354, పులివెందుల : 9985411183
జమ్మలమడుగు : 9985401296 మైదుకూరు : 7989603861 రాజంపేట : 9985411193
రాయచోటి: 9985411193 బద్వేలు : 9985921375 కోడూరు : 9985411193

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కడప - C.O.: 99854 04960
పులివెందుల - S.R.: 95812 61647
D.C.M.: 99854 11184

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్

● ప్రమాదం జరిగితేకాని పట్టించుకోరా..? ● నెలలు గడుస్తున్నా అమర్చని ఐరన్ గ్రిల్స్ ● ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు

ప్రొద్దుటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని అనేక చోట్ల మ్యాన్‌హోల్స్‌కు ఐరన్ గ్రిల్స్ దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. వాటి వల్ల ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు సంభవిస్తున్నా మున్సిపల్ అధికారులు స్పందించటం లేదని పలువురు వాపోతున్నారు. మున్సిపాలిటీలో పరిధిలో లక్ష రూపాయలలోపు చిన్న చిన్న పనులు కూడా జరగడంలేదు. కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. పనులు చేసినా అధికారులు బిల్లులు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంతో వారు స్పందించడం లేదని చెబుతున్నారు. ఇటీవల మ్యాన్‌హోల్స్‌కు గ్రిల్స్ ఏర్పాటు చేయడానికి బాక్స్ టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. మున్సిపల్ కమిషనర్‌కు రెండు లక్షల వరకు ఎమర్జెన్సీ పనులు చేపట్టడానికి సి బిల్లులు పెట్టుకోవడానికి అనుమతులు ఉన్నా ఆయన అందుకు సిద్ధపడటం లేదని వాపోతున్నారు.

మున్సిపల్ ఈఈ ఏమన్నారంటే..

మున్సి పల్ పరిధిలో మ్యాన్‌హోల్స్ ఏర్పాటుపై మున్సి పల్ ఈఈ శ్రీనివాసులును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా మ్యాన్ హోల్స్ కోసం బాక్స్ టెండర్లకు పిలిచామన్నారు. అయితే కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. ఎమర్జెన్సీ ఉన్న వి ఒక్కొక్కటి చేస్తున్నామని ఈఈ తెలిపారు.



శివాలయం రోడ్డులో దెబ్బతిన్న మ్యాన్ హోల్



గాంధీ రోడ్డు నుంచి సార్వకట్టవీధి మలుపులో మూతలేకుండా ఉన్న మ్యాన్‌హోల్



దొరసానిపల్లె రోడ్డు సాయిరాం నగర్ సమీపంలోని మ్యాన్‌హోల్ దుస్థితి

ఉపాధిలో అక్రమాలకు చెక్

రాజుపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో ఈకేవైసీ చేస్తున్నట్లు ఏపీవో వసంత కుమార్ పేర్కొన్నారు. వివిధ గ్రామాల్లో ఉపాధి హామీలో పాల్గొనే కూలీలకు ఫొటో తీయడం, ఈకేవైసీ చేయించడం ద్వారా పనికి ఫొటో తీసిన వ్యక్తినే ఖచ్చితంగా ఉపాధి పనిలో పాల్గొంటే కూలీ డబ్బులు వస్తుందన్నారు. కొంత మంది సిబ్బంది మేట్‌లు కలిసి అక్రమాలకు పాల్పడి ఉపాధి నిధులు దుర్వినియోగం చేయడంతో అలాంటివి లేకుండా ఈ విధంగా చేస్తున్నట్లు తెలిపారు.

కూలీలకు ఈకేవైసీ తప్పని సరి

ముద్దనూరు అక్టోబర్10(ఆంధ్రజ్యోతి):ఉపాధి కూలీలు తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీవో గంగయ్య సూచించారు. మండలంలో 9800 మంది ఉపాధి కూలీలు ఉండగా 5700 మందికి ఈకేవైసీ చేయించుకున్నట్లు తెలిపారు. వచ్చే నెల నుంచి ఉపాధి కూలీ పనులు, డబ్బులు ఆన్‌లైన్ ద్వారా కేటాయించడం జరుగుతుందన్నారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరు త్వరగా ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్‌ను సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

విత్తనోత్పత్తి రైతులు అగ్రిమెంట్లు తీసుకోండి

దువ్వూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సీడు జొన్న, మొక్కజొన్న సజ్జ పంటలను విత్తనోత్పత్తి కింద సాగు చేసే రైతులు ఆయా కంపెనీల నుంచి అగ్రిమెంట్లు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఆశించిన దిగుబడులు రానిపక్షంలో సదరు కంపెనీలు రైతులకు పరిహారం చెల్లించాలంటే అగ్రిమెంట్లు తప్పనిసరి అని వ్యవసాయాధికారి పేర్కొన్నారు. ఆర్గనైజర్లు చెప్పే తప్పుడు మాటలను రైతులు నమ్మవద్దని వివరించారు. వారి స్వలాభం కోసం కంపెనీల తరుపున వకాల్తా పుచ్చుకుని ఆర్గనైజర్లుగా వ్యవహరిస్తుంటారని అలా రైతులను మోసగించే వ్యక్తులను నమ్మవద్దని తెలిపారు.

బీజేపీ అధ్యక్షుడిని కలిసిన బద్వేలు మార్కెట్‌యార్డు చైర్మన్



బీజేపీ జిల్లా అధ్యక్షుడిని సన్మానిస్తున్న మార్కెట్‌యార్డు చైర్మన్ సుప్రజా దంపతులు

పోరుమామిళ్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):స్టేట్ మార్కెట్ డైరెక్టరు బీజేపీ జిల్లా నాయకుడు శశిభూషణ్‌రెడ్డి దంపతులను బద్వేలు మార్కెట్‌యార్డు చైర్మన్ సుప్రజా దంపతులు కలిసి వారిని సన్మానించారు. శుక్రవారం పులివెందుల ప్రాంతంలోని అగ్రహారంలో ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కోకన్వీనరు పల్లెంశెట్టి పండరి, రమణాచారి, శ్రీనివాసుల రెడ్డి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

కొండాపురంలో ఆధార్ సేవలు తిరిగి ప్రారంభం

కొండాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం-1 సచివాలయంలో ఆగిపోయిన ఆధార్‌సేవలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. సచివాలయ సిబ్బంది బదిలీల వల్ల ఆగిన ఆధార్‌సేవలు కొత్త సిబ్బందితో తిరిగి ప్రారంభమవుతాయని తెలిపారు. అదేవిధంగా పొట్టిపాడు, తాళ్లప్రొద్దుటూరు ,ఎర్రగుడి సచివాలయాలలో కూడా ఆధార్‌సేవలు ప్రారంభం అయ్యాయని వాటిని స్థానిక ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పంటలకు పరిహారం ఇవ్వాలి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల వల్ల బి.మఠం మండలంలోని పలు గ్రామాల్లో వరిపంట భారీగా దెబ్బతిందని ప్రభుత్వం స్పందించి నష్టపరిహారి ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి పెదుళ్లపల్లె ప్రభాకర్ కోరారు. శుక్రవారం ఆయన బి.మఠంలో విలేకర్లతో మాట్లాడుతూ వర్షాల వల్ల దిరసవంచ గ్రామంలో వంద ఎకరాలకు పైబడి పంట నష్టం జరిగిందని అదే విధంగా సోమిరెడ్డిపల్లెలో కూడా భారీగా వరి పంట దెబ్బతిందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి నారాయణ, రాజా, ఏఐవైఎఫ్ కార్యదర్శి మల్లేశ్ పాల్గొన్నారు.

పాఠశాలల సమయానికి బస్సులు నడపండి



ఆర్టీసీ డీఎంకు సమస్యలు విన్నవిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నేతలు

జమ్మలమడుగు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యార్థులకు పాఠశాలల సమయానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని జమ్మలమడుగు టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు మహేష్ కోరారు. ఆమేరకు శుక్రవారం డిపో మేనేజర్ సుబ్బమ్మకు వినతిపత్రం అందజేశారు. జమ్మలమడుగు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా సుబ్బమ్మ బాధ్యతలు చేపట్టిన మూడవ రోజు టీఎన్ఎస్ఎఫ్ సంఘ నాయకులు కలిసి విద్యార్థుల సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంటు అధికార ప్రతినిధి సిద్దార్థరాయల్, ప్రతాప్, సాయి, మహేంద్ర, టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలపై విద్యార్థులకు అవగాహన

బద్వేలుటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మత్తుపదార్థాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో రాచపూటి నాగభూషణం కళాశాలకు చెందిన విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు అర్బన్‌సీఐ లింగప్ప, ఎస్ఐ సత్య నారాయణ నాగభూషణం కళాశాల పరిపాలన అధికారి సాయిక్రిష్ణ, పోలీసు కళాజాగృతి బృందం తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా స్వామిత్వ సర్వే

రాజుపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇళ్లు, రోడ్లు, ఖాళీస్థలాలను స్వామిత్వ సర్వే గుర్తించి ఆ సర్వేను వేగవంతం చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి నూర్జహాన్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ సభా భవనంలో గ్రామ పంచాయతీ అధికారులతో డీపీవో మాట్లాడుతూ ఆస్తి తగాదాలు తగ్గించి గృహ యజమానులకు చట్టబద్దమైన ఆస్తికార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షాకిర్‌ఆలీఖాన్, గ్రామ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు తోడ్పాటు

కాశినాయన అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి ఐక్యతకు ఆటల పోటీలు ఎంతో దోహదపడుతాయని ఎంఈవోలు ఎస్ మహమ్మద్ షఫీ. నిర్మల, ప్రదానోపాధ్యాయుడు నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. వ్యాయామ పాధ్యాయులు మోడల్ పాఠ శాల, వరికుంట్ల కస్తూర్భా విద్యాలయ నర్సాపురం జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బోధనేతర పనులు బహిష్కరణ

మైలవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు శుక్రవారం నుంచి బోదనేతర పనులు బహిష్కరిస్తున్నట్లు ఎస్టీయూ స్టేట్ కౌన్సిలర్ కుండా బాస్కర్ తెలిపారు. శుక్రవారం ప్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పోరుబాట కార్యక్రమంలో భాగంగా బోదనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు ఎంఈవో 1, 2 శ్రీనివాసులు, చిట్టిబాబులకు ప్యాప్టో సంఘం ఉపాధ్యాయ సంఘ నేతలు వినతి పత్రం అందజేశారు.

'అధికారుల నిర్లక్ష్యంతోనే కాల్వకు గండి'

కలసపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నీటటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే కాల్వకు గండిపడి నీరు వృథా అవుతున్నాయని సీపీఐ బద్వేల్ ఏరియా కార్యదర్శి పిడుగుమస్తాన్, మండల కార్యదర్శి సునీల్‌లు విమర్శించారు. మండల పరిధిలోని తెల్లపాడు సమీపంలో తెలుగుగంగ కాల్వకు గండి పడినప్రాంతాన్ని వారు శుక్రవారం పరిశీలించారు.

చినుకుపడితే చెరువులుగా ఎన్‌హెచ్‌రోడ్లు



నీరు రోడ్లపైకి రావడంతో ఎక్స్‌కవేటర్‌తో కాలువ తీస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): చినుకుపడితే చాలు ఎన్‌హెచ్ రోడ్లన్నీ చెరువులుగా మారుతున్నాయి. ఎర్రగుంట్లలో గురువారం రాత్రి 29.4 మి.మీ. వర్షం కురవడంతో బారీగా వర్షపు నీరు చేరింది. కడప రోడ్డులోని మహేశ్వరనగర్, మరికొన్ని వీధుల్లో నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో మెయిన్ రోడ్డుపైకి కాలువ తీస్తున్నారు. భారత్ కాంప్లెక్స్ మొదలుకుని టీడీపీ ఆఫీసు, ఎస్‌బీఐ, జువారీ రైల్వే బ్రిడ్జి వరకు ఎన్‌హెచ్ 716పై బారీగా నీరు ఆగింది. ప్రధాన రోడ్డు వెంబడి మున్సిపాలిటీ అధికారులు నీరు వెళ్లేందుకు ఎక్స్‌కవేటర్‌తో కాలువ తీయిస్తున్నారు. అయినప్పటికీ ఈ నీరంతా జువారి రైల్వేలైన్ వద్ద ఆగిపోయి రోడ్డుపై బారీగా ఆగాయి.

రూ.7కోట్లతో ప్రతిపాదనలు పెట్టాం : ఏఈ

ముఖ్యమంత్రి జమ్మలమడుగు మీటింగ్‌లో ఇచ్చిన హామీలో భాగంగా ఎర్రగుంట్ల మున్సిపాలిటికి మంజూరు అయిన నిధుల్లో రూ.7కోట్లతో కడప రోడ్డు వెంబడి ప్రధాన డ్రైన్లు, ఇంటర్నల్ డ్రైన్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు పెట్టామని ఏఈ బాలక్రిష్ణ తెలిపారు. నిధులు వచ్చిన వెంటనే వాటికి టెండర్లు పిలిచి పనులు చేస్తామన్నారు.

బద్వేలులో దంచికొట్టిన వర్షం



వర్షంతో జలమయమైన రహదారులు

బద్వేలుటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఉపరితల ఆవరణ ప్రభావం వలన శుక్రవారం సాయంత్రం బద్వేలులో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం దంచికొట్టింది. దీంతో రోడ్లన్నీ జలమయం కావడంతో ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మురుగునీరు, వర్షపునీరు కలిసి రహదారిపై నిలబడిపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. ఉదయం నుంచి ఒక పక్క ఎండ ఎక్కువగా కాయడంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా ఒక్కసారిగా వర్షం కురవడంతో ఉపసమనం పొందారు.



మహాత్మాగాంధీ విగ్రహం సమీపంలో రోడ్లపైన నిలిచిన వర్షపు నీరు

పోరుమామిళ్ల,లో: పోరుమామిళ్లలో కురిసిన వర్షానికి ప్రధాన రహదారుల్లో నీరు నిలిచి పాదాచారులు, వాహనదారులకు ఇబ్బందులు పడ్డారు. మహత్మాగాంధీ విగ్రహం వెనుక వైపు ఉన్న దుకాణాల వద్ద వర్షం నీరు చేరి నీటి గుంటను తలపిం చింది. సైడ్ కాల్వలు లేకపోవడంతో ఆ నీళ్లన్నీ రోడ్లపైనే నిల్వ ఉండిపోయాయి. అలాగే స్టేట్ బ్యాంకు సమీపంలో సిమెంటు రోడ్డుపై నీరు నిల్వడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఖాజీపేటలో: మండల పరిధిలో శుక్రవారం సాయంత్రం ఉన్నపలంగా ఉరుములతో, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఉల్లి పెరికిన రైతులు లబోదిబోమంటున్నారు. రేటు అంతంతమాత్రమే ఉండడంతోపాటు ఈ వర్షానికి తడిస్తే పెట్టుబడి దేవుడెరుగు కూళ్లు వచ్చినా చాలు అంటూ రైతన్నలు అంటున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల బాలికలు



రాష్ట్రస్థాయిలో ఎంపికైన బాలికలతో ప్రిన్సిపాల్ నిర్మల

మైదుకూరు రూరల్,అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : బాస్కెట్ బాల్ పోటీలలో వనిపెంట గురుకుల పాఠశాలకు చెందిన అండర్- 19 పరుగు పందెంలో, బాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ నిర్మల శుక్రవారం పత్రికా ప్రకటనలో తెలిపారు.స్థానిక మేధా డిఫెన్స్ అకాడమిలో స్టేట్ గురుకుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 4వేల మీటర్ల పరుగు పందెం పోటీలో పి కుసుమ జిల్లా స్థాయిలో రెండవ బహుమతి సాధించింది. అలాగే గండిలోని సోషియల్ వెల్ఫేర్ కాలేజీలో జరిగిన అండర్-19 బాస్కెట్ బాల్ పోటీలలో పి లక్ష్మి అపూర్వ, అమీరూన్, హిమబిందు, అలాగే హ్యాండ్ బాల్ పోటీలలో స్నేహ మంచి ప్రతిభ కనపరిచారని తెలిపారు. వారంతా జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీ జిల్లా కన్వీనర్ రామక్రిష్టారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నజీరా, పీఈటీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులపై కార్పొరేట్ దోపిడీని ఆపాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వనరులపై కార్పొరేట్ దోపిడీ ఆపాలని పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం మిత్రజ్యోతి, విరసం, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అభివృద్ధి పేరుతో ఛత్తీస్‌ఘడ్‌లో ఏం జరుగుతోంది పుస్తక పరిచయ సభను జేవీవీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ పేరుతో 90వ దశాబ్దం నుంచి కార్పొరేట్ పెట్టుబడిదారులకు సహజవనరులను దోచిపెట్టడానికి పాలకులు కుట్రలకు తెరలేపారని విమర్శించారు. విరసం వరలక్ష్మి మాట్లాడుతూ అడవులను విధ్వంసం చేయడం వలన పర్యాటకరంగం సంక్షోభంతోపాటు వాతావరణ మార్పులు జరుగుతాయన్నారు. మిత్రజ్యోతి కన్వీనర్ మహమూద్, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా యూత్ కన్వీనర్ హేమంత్‌కుమార్, అధ్యక్షుడు రాజశేఖర్, రమణ, చంద్రశేఖర్, దేవానంద్, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కల్పనతో ఆర్థికాభివృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పనతోపాటు ఆర్థిక వనరులు మెరుగుపడేలా పనులను చేపట్టాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథక సామాజిక తనిఖీ, ప్రజావేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోట్ల రూపాయల ప్రభుత్వ వ్యయంతో చేపట్టే పనుల్లో కూలీలకు ఉపాధితోపాటు గ్రామాలకు శాశ్వత ప్రయోజనాలు చేకూరే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి రోడ్డు, చెరువులు, నీటి కుంటలు లాంటి శాశ్వత పనుల నిర్వహణ చేయాలన్నారు. డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ పనుల్లో నాణ్యతతోపాటు కూలీలకు పనిదినాల కల్పనకు కొత్త పనులు ఉగ్రించాలని వివరించారు. 2024-25లో సామాజిక తనిఖీల్లో భాగంగా కూలీలకు వేతన రూపంలో రూ.4.79 కోట్లు కాగా మెటీరియల్ పేమెంట్ రూ.5.10 కోట్లు అయిందని ఏపీవో మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని 15 పంచాయతీల్లో జరిగిన ఆడిట్‌లో రూ.25 వేలు రికవరి జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డ్వామా విజిలెన్స్ అధికారి జుబేదా, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌కుమార్‌కుమార్‌రెడ్డి, పీఆర్‌ఏఈ గణేష్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగు

పోరుమామిళ్ల, అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి): జీఎస్టీ తగ్గడం వల్ల ప్రజలు వారి ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించేందుకు అవకాశం ఏర్పడిందని జీసీ టీవో విజయలక్ష్మి, ఏసీటీవో శ్రీనివాసు లు, ప్రవీణకుమార్, ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం పోరుమామిళ్లలో ఎలక్ట్రానిక్స్ సేల్ మేళా నిర్వ హించారు. ఈ సందర్భంగా బద్వేలు డివిజనులోని వాణిజ్య పన్నులశాఖ అధికారులు హాజరై సూపర్ జీఎస్టీ పట్ల వినియోగదారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీవీ, ఎల్ఈడీ టీవీలు, ఏసీలు తదితర వస్తువులపై ప్రస్తుతం 18 శాతానికి తగ్గించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పోరుమా మిళ్ల పంచాయతీ కార్యదర్శి రాజనాల చిన్న ఓబులేసు, జూనియనర్ అసిస్టెంటు సుదర్శన్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి : ఆర్డీవో

బద్వేలు , అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ సందర్భంగా టపాసులు విక్రయించే వ్యాపారులు నిబంధనలను తప్పక పాటించాలని ఆర్డీవో చంద్రమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయిలో సంబంధిత శాఖల అధికారులు, టపాసుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఎవరైనా అధిక ధరలకు టపాసులు విక్రయించినా, నిబంధనలు పాటించకపోయినా అలాంటి వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డీఎస్పీ రాజేంద్రప్రసాద్, తహశీల్దారు ఉదయభాస్కర్‌రాజు, అర్బన్ సీఐ లింగప్ప, అధికారులు పాల్గొన్నారు.

తెలుగుగంగ నీటితో నిండిన చెరువులకు జలహారతి



జలహారతి ఇస్తున్న తహసీల్దారు సుబ్బలక్షుమ్మ, టీడీపీ నాయకులు

అట్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ నీటితో చెరువులకు జలకల వచ్చిందని టీడీపీ నాయకులు శుక్రవారం జలహారతి ఇచ్చారు. బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ యువ నాయకుడు రితీష్‌రెడ్డి నాయకత్వంలో కుంభగిరి టీడీపీ యువ నాయకుడు పాలకొండరాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కుంభగిరి సిద్దురాజ చెరువు బ్రహ్మంసాగర్‌నీటితో నిండు కుండలా నీరు చేరడంతో తహసీల్దారు సుబ్బలక్షుమ్మ, బద్వేలు మార్కెట్ యార్డు డైరె క్టరు శివకుమార్, కుంభగిరి ఎంపీటీసీ చిన్నగంగయ్య జల హారతి చేపట్టారు. కూటమి ప్రభుత్వం లో చెరువులకు నీరు నింపడంతో తాగు, సాగునీటికి ఎంతో లాభదాయకమని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పుల్లయ్య, టీడీపీ నాయ కులు పెంచలయ్యమల్లెంకొండయ్య, ఎల్లయ్య డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వం దివ్యాంగులను ఆదుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగులను ఆదుకోవాలని ఆల్ఆఫ్‌యా దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ పేర్కొన్నారు. శుక్రవారం సంఘం సమావేశం మున్సిపల్ పార్కు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన సదరం వెరిఫికేషన్‌లో అనేక తప్పులు దొర్లాయని, ఒకరిఫొటో బదులు మరొకరి ఫొటో, నిజమైన దివ్యాంగులకు పర్సంటేజీ తగ్గించడం జరిగిందన్నారు. పోలియో ద్వారా రెండు కాళ్లు చచ్చుబడిన వారికి పర్సంటేజీ తగ్గించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజామొహిద్దీన్, ఆంజనేయులు, మహేష్‌కుమార్, రషీద్, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయవద్దు

జమ్మలమడుగు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయవద్దని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కోరారు. శుక్రవారం జమ్మలమడుగులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో తీసుకువచ్చిన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయాలని కూటమి ప్రభుత్వం చూడడం దారుణమన్నారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రతి నియోజకవర్గం నుంచి 60 వేల సంతకాల సేకరణ ఉంటుందన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ముల్లాజానీ, పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, కొమెర్ల మోహన్‌రెడ్డి, దేవగుడి చంద్రశేఖర్‌రెడ్డి, దన్నవాడ మహేశ్వరరెడ్డి, గండికోట గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి

కలసపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలానికి చెందిన ఇద్దరు మహిళలకు శుక్రవారం బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌కుమార్‌రెడ్డి సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. రాజుపాళెంకు చెందిన ప్రమీలమ్మకు రూ.95,800, బ్రాహ్మణపల్లె చెందిన మునీశ్వరికి రూ.18,600 చెక్కులను అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పట్టాభిరెడ్డి, కోశాధికారి రోశిరెడ్డి, రాచ్చె రువునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, యువనాయకుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోపవరంలో మినరల్ వాటర్ ప్లాంట్లు ప్రారంభం

గోపవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గోపవరం ప్రాజెక్టు కాలనీ -1, కాలనీ -2లో శుక్రవారం సెంచరీ ప్యానల్స్ లిమిటెడ్ కంపెనీ వారి సహకారంతో గంటకు వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు మినరల్ వాటర్ ప్లాంట్లను బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్, బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రితీష్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రితీష్‌రెడ్డి మాట్లాడుతూ సీఎస్ఆర్ యాక్టివిటీస్ ద్వారామినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ రామ్మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామసు బ్బారెడ్డి, రామానాయుడు, ఏవో సుధాకర్‌రెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జమ్మలమడుగు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో రెండో శనివారం పురష్కరించుకుని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రాజగోపాల్ తెలిపారు. జమ్మలమడుగు పట్టణంతోపాటు మైలవరం, పెద్దముడియం, ముద్దనూరు, కొండాపురం మండలాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం

దువ్వూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో తల్లిదండ్రులను కోల్పోయిన యశ్వంత్, లక్ష్మి అనే చిన్నపిల్లలకు స్థానిక జీపు డ్రైవర్ల ఓనర్లు రూ.6,500 ఆర్థికసాయం అందజేశారు. సహారా యూత్ ఫౌండేషన్ ద్వారా పలువురికి సహాయం చేసేందుకు తాము ముందుంటామని అధ్యక్షుడు షాజహాన్ పేర్కొన్నారు.



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
ప్రొద్దుటూరు - A.C.O.: 99854 11466 జమ్మలమడుగు - S.R.: 94404 72816 మైదుకూరు - S.R.: 91334 42886 బద్వేల్ - S.R.: 99666 83437 D.C.M. : 99854 11184